



Published From Hyderabad, Mahabubnagar and Kadapa

# వార్తాతరంగాలు

జాతీయ దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :156 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 16 అక్టోబర్ 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు



**సీజేఐ సూర్యకాంత్**

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు సుప్రీంకోర్టు వరకు చేపట్టిన నిరసన ప్రదర్శనపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు చేసే ప్రయత్నాలను ఎవరూ పట్టించుకోరని తేల్చిచెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయాలను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అయితే, నోటీసులు జారీ చేసినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు సరికాదు..**

విచారణ సందర్భంగా - మిగతా3లో

## సింగరేణిని ప్రైవేటీకరించబోమని
# శ్రీధర్‌బాబు స్పష్టీకరణ

**సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన..**

**ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి**

**గత బీఆర్ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు**

**సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ**

**ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన**

**హైదరాబాద్:**సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ



ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.



## ఎస్ఐఆర్‌పై
# రాహుల్ గాంధీ పిటిషన్..

**ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు**

**ఎస్ఐఆర్ పిటిషన్‌పై ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు**

**ఎస్ఐఆర్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి**

**అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థన**

**నిరసన వేదికగా జంతర్ మంతర్ తొలగింపు పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు నోటీసులు**

**సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ధర్మాసనం ఆదేశం**

**న్యూఢిల్లీ:**ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భారీగా ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నేడు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎస్ఐఆర్ వ్యవహారంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఇటీవల సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లి ఉమ్మడి పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన ఓట్ల తొలగింపులు, మార్పులపై స్వతంత్రంగా ఆడిట్ నిర్వహించాలని ప్రతిపక్ష నేతలు కోరారు. ఇందుకోసం - మిగతా3లో

## గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు
# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్:**హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని మూడు జిల్లాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల అధికారులతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయం నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పాటు, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి:**

గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం ఈజీఎస్ కింద బతుకమ్మ ఘాట్ల వద్ద శుభ్రత, మట్టి పనులు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు, మండల స్థాయి అధికారులు



సమన్వయంతో పనిచేసి వేడుకలను - మిగతా3లో

## విదేశీ బొగ్గు దిగుమతితో సింగరేణికి
# మరణశాసనం..

**కేటీఆర్**

**హైదరాబాద్, అక్టోబర్ 15:** విదేశీ బొగ్గు దిగుమతి పేరిట సింగరేణికి సీఎం రేవంత్ రెడ్డి మరణశాసనం రాస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో రూ.3 వేల కోట్ల భారీ స్కాంకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నారని విమర్శించారు. ఈ విదేశీ బొగ్గు స్కాంను వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖను కేటీఆర్ విడుదల చేశారు. భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే సీఎం రేవంత్ చీకటి ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో కావాలనే కృత్రిమ బొగ్గు కొరత, కరెంట్ సంక్షోభం సృష్టించి అదను చూసి సదరు కంపెనీని రంగంలోకి ఆయన దింపారని మండిపడ్డారు. భోత్రా లాజిస్టిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సింగరేణి సంస్థ చేసుకున్న అన్ని రహస్య ఒప్పందాలను బయటపెట్టాలని సీఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన సదరు కంపెనీని ఎంపిక చేశారో



సమాధానం చెప్పాలని తెలంగాణ సీఎంను ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. మొత్తం కుంభకోణంపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ - బీజేపీ కలిసి చేస్తున్న ఈ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌కు సరఫరా - మిగతా3లో

## రెండు రాష్ట్రాల మధ్య
# రాజకీయ ఆధిపత్యం



**హైదరాబాద్ అక్టోబరు 15 :**ఆంధ్రప్రదేశ్ విడిపోయి 12 ఏళ్లు దాటింది. అయిన రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు మాత్రం ఇప్పటికీ అలాగే ఉండిపోయాయి. ఇవి నిత్యం రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. తాజాగా రెండు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. అయితే, చంద్రబాబు ప్రతిపాదనపై తెలంగాణలో అనేక సందేహాలు, వ్యతిరేకత వ్యక్తమవుతున్నాయి. చట్టబద్ధంగా రావాల్సిన వాటిని పక్కనపెట్టి, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలనే చంద్రబాబు ప్రతిపాదనను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.ఇటీవల జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి చంద్రబాబు - మిగతా3లోం



## ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం
# తీవ్ర స్థాయికి...

**తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు**

**ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరిగాయని సీఎస్ వెల్లడి**

**పంటలకు రానున్న 15-20 రోజులు కీలకం**

**భూగర్భ జలమట్టాలు పడిపోవడంపై ఆందోళన**

**తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం**

**ప్రతి జిల్లాకు నోడల్ అధికారులు**

సింగూరు, మంజీరా జలాశయాల నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలోని - మిగతా3లో

## విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి
# తీవ్ర అసంతృప్తి..

**సీఎం రేవంత్ ఆదేశాల అమలు..**

**విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్**

**యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్**

**విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు**

**విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ**

**ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక**

**హైదరాబాద్ :**తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం



సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి - మిగతా3లో

# సంపాదకీయం

## సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం

తమిళనాడు రాజకీయ వేదికపై దశాబ్దాలుగా నడుస్తున్న సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం కనిపిస్తోంది. ఒకప్పుడు ద్రవిడ ఆత్మగౌరవం, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి , హిందీ వ్యతిరేక నినాదాలతో జాతీయ పార్టీలను, ముఖ్యంగా కాషాయ రాజకీయాలను నిరంతరం శత్రువుగా చిత్రీకరించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన తమిళనాడులో అడుగుపెట్టిన ప్రతిసారీ విపక్షాలు, తమిళ జాతీయవాద సంఘాలు గో బ్యాక్ మోదీ నినాదాలతో విరుచుకుపడేవి. నల్లజెండాలు, ఆకాశంలోకి ఎగిరే నల్ల బెలూన్లు ప్రధాని పర్యటనలకు నిరసన కాన్వాయ్‌లుగా మారిన రోజులను తమిళనాడు చూసింది. కానీ, ల చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభోత్సవంతో పాటు రూ. 13,000 కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ పర్యటించిన తీరును పరిశీలిస్తే, రాష్ట్రీయ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సారి ప్రధాని పర్యటన వేళ గాలిలో నల్ల బెలూన్లు కానీ, రోడ్లపై భయానక నిరసనలు కానీ ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో రవాణా, విద్య, పరిశోధన, మౌలిక వసతుల రంగాలు వేగంగా పుంజుకునేలా రూ. 13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఇందులో ప్రధానంగా చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గం ప్రారంభోత్సవంతో పాటు ఐఐటీ మద్రాస్ బ్రెయిన్ సెంటర్ సందర్శన లాంటి కీలక అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీతో కలిసి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అటు పరిపాలన పరంగా, ఇటు రాజకీయ వర్గాల్లో ఈ భేటీ సరికొత్త చర్చకు దారితీసింది. రాజకీయ వైరుధ్యాలు పక్కనబెట్టి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రధానితో ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా, మెట్రో రైలులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించడం తమిళనాడు క్షేత్రస్థాయి రాజకీయాల్లో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేంద్ర పెద్దల పర్యటనను నిరసనలతో హోరెత్తించే సంస్కృతి స్థానంలో ఇప్పుడు సంయమనం, పరస్పర గౌరవం చోటుచేసుకున్నాయి. తమిళ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషిస్తే.. తమిళ ప్రజల ఆలోచనా విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఉచితాలు , సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి , మౌలిక వసతుల కే తమిళ యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. చెన్నై మెట్రో విస్తరణ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పారిశ్రామిక హబ్‌లకు కేంద్ర నిధులు అత్యంత ఆవశ్యకమని భావిస్తున్న నేపథ్యంలో, అనవసరమైన రాజకీయ ద్వేషం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయం తమిళ నెటిజన్లలో వ్యక్తమవుతోంది. తమిళనాడు రాజకీయ రంగాన కొత్తగా ఆవిర్భవించిన పొలిటికల్ శక్తులు , మారిన ద్రవిడ కూటముల వ్యూహాలు కూడా ఈ మార్పునకు కారణమయ్యాయి. బీజేపీపై కేవలం రొటీన్ ఆరోపణలతో ఇకపై ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేమని గ్రహించిన ప్రధాన ద్రవిడ పార్టీలు, వ్యూహాత్మకంగా తమ ఘర్షణ వైఖరిని తగ్గించుకున్నాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో తిరుక్కురళ్ పద్యాలను, తమిళ సంస్కృతి, భారతీయార్ కవితలను నిరంతరం ప్రస్తావిస్తూ తమిళ భాషాభిమానాన్ని ఆకట్టుకునేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు కాషాయంపై ఉన్న సైకలాజికల్ భయాన్ని గణనీయంగా తగ్గించాయి. ఈ మార్పు వెనుక ఉన్న మరో ముఖ్యమైన రాజకీయ కోణం.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలకు మారుతున్న అవసరాలు. ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీ గా చూసిన ద్రవిడ నేతలు ఇప్పుడు కేంద్రంతో సత్సంబంధాలు నెరపడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి నిధులు తెచ్చుకోగలమని భావిస్తున్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ వేగంగా పుంజుకోవడం, ఓటు బ్యాంకును విస్తరించుకోవడంతో నేరుగా కాషాయ శ్రేణులతో విభేదించడం కంటే రాజకీయ పోటీని ప్రజాసమస్యలపైకి మళ్లించడమే ఉత్తమమని స్థానిక నాయకత్వాలు నిర్ణయించుకున్నాయి. ఒకప్పుడు తమిళనాడు రాజకీయాల్లో విజయానికి మార్గంగా ఉన్న కాషాయ వ్యతిరేకత , బీజేపీ ద్వేషం ఇప్పుడు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోంది. నల్ల బెలూన్ల స్థానంలో అభివృద్ధి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చే నయా రాజకీయ శకం తమిళ నేలలో ప్రారంభమైంది. రాబోయే ఎన్నికల్లో కేవలం భావోద్వేగాలు, ద్రవిడ సెంటిమెంట్లు మాత్రమే కాకుండా, సంక్షేమం , మౌలిక వసతుల రూపకల్పనే గెలుపోటములను నిర్ణయించే ప్రధాన అంశంగా మారబోతోంది.

# 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్..

## మహిళల భాగస్వామ్యం కీలకం:రాష్ట్రపతి ముర్ము

**విజయవాడ, అక్టోబర్ 15:**పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని.. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు. దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళాను నిర్వహించడం ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధి అంటే గ్రామాల వికాసమని చెప్పుకొచ్చారు. మహిళల స్టాళ్లను సందర్శించే అవకాశం దక్కిందని.. వారి ఉత్సాహం, వారి ముఖాల్లోని చిరునవ్వు చూస్తుంటే మహిళలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని స్పష్టమవుతోందన్నారు. ఒకప్పుడు మహిళలు వెనుకబడి ఉండేవారని.. కేవలం కుటుంబ సంరక్షణకే పరిమితమై, ఆర్థికంగా చిన్న చిన్న అవసరాల కోసం కూడా ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ నేడు మహిళలు సంపూర్ణంగా స్వయం సమృద్ధి సాధించారన్నారు.



**ఇతరులకు ఆసరాగా మహిళలు**

మహిళలు కేవలం స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, ఇతరులకు కూడా ఆసరాగా నిలుస్తున్నారని ముర్ము తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో మహిళల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన, మహిళల సంకల్పం దేశంలోని ముఖ్యమంత్రులందరి ఉమ్మడి కృషి ఫలితంగా మహిళా సాధికారత ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. 2047 కంటే ముందే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదని ధీమా వ్యక్తం చేశారు.

**మహిళల భాగస్వామ్యం పెరిగింది**

వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమైనదని రాష్ట్రపతి వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక, సాంకేతిక సామాజిక సాధికారత దిశగా కొత్త మార్గం లభించిందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు, కుటుంబంలో ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ మహిళల భాగస్వామ్యం పెరిగిందన్నారు. భారతదేశం భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, వేర్వేరు సంప్రదాయాలు కలిగిన దేశమైనప్పటికీ అంతా ఒక్కటే అని అన్నారు.

**గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ప్రాధాన్యం**

ప్రస్తుత గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మంది మహిళలు రాజకీయాల్లో భాగస్వాములవుతున్నారని ద్రౌపది ముర్ము అన్నారు. ఒకప్పుడు బ్యాంకుల వద్దకు వెళ్లడానికి సంకోచించిన మహిళలు, నేడు ఎవరి సాయం లేకుండా స్వయంగా బ్యాంకులకు వెళ్లి తమ పనులను స్వతంత్రంగా చక్కబెట్టుకుంటున్నారని తెలిపారు. అంత్యోదయ సమగ్ర దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తన గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలే గ్రామాల రూపురేఖలను మార్చే నాయకత్వాన్ని అందిస్తున్నారని చెప్పారు. భారత ప్రభుత్వం లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళా సాధికారతకు ఒక ప్రత్యేకమైన వేగం, దిశానిర్దేశం అందించిందన్నారు.

**నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు..**

డిజిటల్ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి ఆధునిక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ, వారికి నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ముర్ము అన్నారు. గవర్నర్‌గా ఉన్న సమయంలో అక్కడి గ్రామీణ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ఆ మహిళలు ల్యాప్‌టాప్‌లను ఉపయోగిస్తూ ఎంత పెట్టుబడి పెడుతున్నారు, ఎంత లాభం పొందుతున్నారు, భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి అనే వివరాలను స్వయంగా ల్యాప్‌టాప్‌లలో నమోదు చేసుకుంటూ పనులు చేసుకునేవారని తెలిపారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని, కుటుంబంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

# ఇస్లాంలోకి మారితే బీసీ రిజర్వేషన్ వర్తించదు..

## సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ:**హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారినంత మాత్రాన తమిళనాడులోని బీసీ ముస్లిం (బీసీఎం) రిజర్వేషన్ ప్రయోజనాలు పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి ఇతర మత సామాజిక వ్యవస్థలోకి మారిన వ్యక్తి.. గతంలో తనకు ఉన్న సామాజిక వెనుకబాటుతనాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) కింద రిజర్వేషన్ కోరలేరని ధర్మాసనం పేర్కొన్నట్లు బార్ అండ్ బెంచ్ వెల్లడించింది. మత మార్పిడి జరిగినంత మాత్రాన గుర్తింపు పొందిన వెనుకబడిన ముస్లిం సమాజాల్లో ఏదో ఒకదానికి చెందినవారిగా పరిగణించలేమని స్పష్టం చేసింది. తమిళనాడు ప్రభుత్వ ఉత్తర్వు ఏంటి?: 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఓ ఉత్తర్వు జారీ చేసింది. వెనుకబడిన తరగతులు (బీసీ), అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డీఎన్‌సీ), షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) చెందినవారు ఇస్లాంలోకి మారితే.. వారికి బీసీ ముస్లిం కేటగిరీలో కమ్యూనిటీ సర్టిఫికెట్లు ఇచ్చి రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాలని అందులో పేర్కొంది. అయితే, ఈ ఉత్తర్వును మద్రాస్ హైకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. తమిళనాడులో బీసీ ముస్లింలుగా గుర్తించిన ఏడు సమాజాల్లో సభ్యత్వం జన్మ ఆధారంగా నిర్ధారితమవుతుందని, మతం మారడం వల్ల మాత్రమే వాటిలో సభ్యత్వం లభించదని తెలిపింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



**ఏడు ముస్లిం సమాజాల అంశం**

తమిళనాడులో బీసీ ముస్లిం కేటగిరీ కింద అన్సార్, డెక్కనీ ముస్లింలు, దుబేకులా, లబ్బాయిన్ (రోవ్‌థర్, మరక్కాయర్ సహా), మాపిళ్ల, షేక్, సయ్యద్ సమాజాలను గుర్తించారు. హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారినంత మాత్రాన వీటిలో ఏదో ఒక సమాజానికి చెందినవారిగా ధ్రువీకరించలేమని హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వం మాత్రం మత మార్పిడి వల్ల సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోదని వాదించింది. రిజర్వేషన్ ప్రయోజనాలు కోల్పోకుండా చూడటమే ఉత్తర్వు ఉద్దేశమని తెలిపింది. కానీ సుప్రీంకోర్టు ఆ వాదనను అంగీకరించలేదు. ఈ కేసు సమీర్ అహ్మద్ అనే వ్యక్తి పిటిషన్‌తో మొదలైంది. ఆయన 2015లో హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారి, లబ్బాయి ముస్లిం సమాజానికి చెందిన వ్యక్తిగా కమ్యూనిటీ సర్టిఫికెట్ కోరారు. అధికారులు దరఖాస్తును తిరస్కరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో భాగంగానే తమిళనాడు ప్రభుత్వ ఉత్తర్వుపై న్యాయపోరాటం సాగింది.

# మరో కేంద్ర మంత్రి రాజీనామా - కొత్త టీం ఎప్పుడు?

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:**కేంద్ర సమాచార ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ హఠాత్తుగా తన పదవితో పాటు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం కలకలం రేపింది. తమిళనాడులో బిజెపి మూలాలను పటిష్టం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేసేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. సాధారణ రోజు కూలీల కుటుంబం నుంచి వచ్చిన తనకు ప్రధాని మోదీ మంత్రివర్గంలో భాగస్వామ్యం కల్పించడం గొప్ప గౌరవమని, ఇకపై పార్టీ ఆర్గనైజేషన్‌కు తన సమయాన్ని కేటాయిస్తానని ఎక్స్ వదికగా వేసిన పోస్ట్‌లో మురుగన్ స్పష్టం చేశారు. మురుగన్ వైదొలగడం కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో మోదీ 3.0 సర్కార్‌లో జరగబోయే భారీ మంత్రివర్గ విస్తరణ కు ఇది ప్రధాన సంకేతమని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా కేంద్ర మంత్రివర్గంలో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాజ్యసభ పదవీకాలం ముగియడంతో కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టూ, జార్జ్ కురియన్ తమ పదవులకు రాజీనామా చేయగా, హర్దీప్ సింగ్ పురీ, బి.ఎల్. వర్మ వంటి సీనియర్లను పార్టీ రాజ్యసభకు పునరుద్ధరించలేదు. మరోవైపు సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాను ఢిల్లీ బిజెపి అధ్యక్షుడిగా నియమించడంతో ఒక వ్యక్తికి ఒకే పదవి నిబంధన ప్రకారం ఆయన కూడా మంత్రిపదవి నుంచి తప్పుకోనున్నారు. ఇలా దాదాపు అరడజనుకు పైగా కేంద్ర మంత్రి పదవులు ఖాళీ కావడంతో, ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ స్థాయిలో భారీ రీ-షఫుల్‌కు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జరగబోయే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, అలాగే 2029 సార్వత్రిక ఎన్నికల వ్యూహాలకు అనుగుణంగా కేంద్ర క్యాబినెట్‌లో ప్రాంతీయ, సామాజిక సమతుల్యతను దెబ్బతినకుండా చూసేందుకు బిజెపి అగ్రనాయకత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపేలా స్థానిక నాయకులను సంస్థాగత బాధ్యతల్లోకి మళ్లిస్తూ, లోక్‌సభ సభ్యులుగా ఉన్న కొందరు సీనియర్లకు కేంద్రంలో అవకాశం కల్పించవచ్చని ప్రచారం సాగుతోంది. మురుగన్ లాంటి సీనియర్ నేతలను తిరిగి క్షేత్రస్థాయికి పంపి, కేంద్రంలో ఖాళీ అయిన స్థానాలను కొత్త ముఖాలతో భర్తీ చేసేందుకు వీలుగా ఢిల్లీ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, పార్టీ యంత్రాంగాన్ని రాబోయే ఎన్నికల కోసం సన్నద్ధం చేయడమే లక్ష్యంగా మోదీ-అమిత్ షాల ద్వయం ఈ మంత్రివర్గ విస్తరణ వేదికగా కొత్త వ్యూహాలను అమలు చేయబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.



# మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి

**వరంగల్:**హైదరాబాద్ స్థాయిలో అత్యాధునిక కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలోని పాత సెంట్రల్ జైలు ప్రాంగణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 24 అంతస్తుల నూతన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను ఈ రోజు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆసుపత్రి ప్రాంగణంలోని వివిధ విభాగాలను కలియతిరుగుతూ నిర్మాణ పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న వైద్య విభాగాలు, రోగులకు అందించనున్న సదుపాయాలు, చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలను సంబంధిత అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాలకు ఆధునిక వైద్య సేవలు మరింత చేరువయ్యే అవకాశంతో పాటు పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన చికిత్స అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క , ఎంపీలు వేం. నరేందర్ రెడ్డి , బలరాం నాయక్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య , ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి , కే.ఎల్. నాగరాజు , ఖుఖణూ చైర్ పర్సన్ గుండు సుధారాణి తో పాటు ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్, వైద్యాధికారులు తదితరులు పాల్గొనారు.

వార్తాతరంగాలు
శుక్రవారం 16 అక్టోబర్ 2026

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు..

# కాంగ్రెస్, బీజేపీ భారీ స్కెచ్!

**హైదరాబాద్ అక్టోబరు 15:**తెలంగాణలో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ పనితీరుకు పట్టభద్రుల తీర్పును మద్దతుగా మలచుకోవడంతో పాటు, రాబోయే రోజుల్లో రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకత్వం పావులు కదుపుతోంది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ తో పాటు నల్గొండ- వరంగల్- ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలనే పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. ఈ ఉద్దేశంతో పార్టీ యంత్రాంగాన్ని ముందస్తుగా అప్రమత్తం చేసింది. మొత్తం 77 మందిని ఇన్‌చార్జ్‌లుగా నియమించి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు సాధించేందుకు ప్రణాళిక రచించింది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 43 మందిని, నల్గొండ- వరంగల్- ఖమ్మం స్థానానికి 34 మంది ఇన్‌చార్జ్‌లను కేటాయించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో ఆయా ఎమ్మెల్యేలకే ఆ బాధ్యతలు అప్పగించడం ద్వారా క్షేత్రస్థాయిలో నాయకత్వ సమన్వయ లోపం రాకుండా జాగ్రత్త పడ్డారు. ఎమ్మెల్యేలు లేని చోట ఎంపీలు, ఎమ్మెల్సీలకు పగ్గాలు అప్పగించారు. కొడంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యతను అనుముల తిరుపతిరెడ్డికి అప్పగించడం ద్వారా నాయకుల మధ్య జవాబుదారీతనం పెంచే ప్రయత్నం చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఈ రెండు ఎమ్మెల్సీ ఎన్నికలపై అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, ఓటర్ల నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో నేతల పనితీరుపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, మొదటి స్థానానికే పూర్తి ప్రాధాన్యం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. మంత్రులు సైతం ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఆదేశించడం ద్వారా ఈ ఎన్నికలను కాంగ్రెస్ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలుపు ఓటములు ప్రధానంగా ఓటర్ల నమోదు ప్రక్రియపైనే ఆధారపడి ఉంటాయి. పట్టభద్రులు పెద్ద ఎత్తున ఓటర్లుగా పేరు నమోదు చేసుకునేలా చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ పోలింగ్ బూత్ వరకు రప్పించడం ప్రస్తుతం కాంగ్రెస్ ముందున్న ప్రధాన



సవాల్. ఈ నేపథ్యంలోనే ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని నేతలను ఆదేశించారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంతో, ప్రచార సమన్వయంపై ఇన్‌చార్జ్‌లు దృష్టిసారించారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల ఫలితాలు రాబోయే రాజకీయ పరిణామాలపై, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయానికి అద్దం పడతాయని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. మేధావి వర్గంగా భావించే గ్రాడ్యుయేట్లు ఇచ్చే తీర్పు ప్రభుత్వానికి మరింత నైతిక బలాన్ని చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి.. అధికారంలో ఉన్న జోరును గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనూ ప్రదర్శించి క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌లో జోష్ నింపాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. ఇన్‌చార్జ్‌ల నియామకం, సీఎం రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచుతున్నాయి.

**రామచందర్ రావు వైపే మొగ్గు!**

తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను బీజేపీ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రెండు కమిటీలను రంగంలోకి దించింది. ఈ కమిటీలు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాయి. ఇందులో ఒక స్థానానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైపే మెజారిటీ నేతలు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ కేడర్ మూడ్‌ను అంచనా వేయడానికి బీజేపీ హైకమాండ్ ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం విడివిడిగా రెండు కమిటీలను ఏర్పాటు చేసి మరీ కిందిస్థాయి అభిప్రాయాలను సేకరిస్తోంది. ముఖ్యంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఈ మూడు ఉమ్మడి జిల్లాల కీలక నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, గెలుపు గుర్రాల ఎంపికపై నేతలు తమ మనసులోని మాటను కమిటీ ముందుంచారు. ఈ అభిప్రాయ సేకరణలో మెజారిటీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత ఎన్.రామచందర్ రావు వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే స్థానం నుండి ప్రాతినిధ్యం వహించిన అనుభవం, పట్టభద్రులలో ఉన్న మంచి పేరు, లాయర్‌గా ఆయనకున్న ప్రజా మద్దతును నాయకులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. చాలా మంది నేతలు ఆయన పేరును మాత్రమే ప్రధానంగా సూచించినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నాయకుడికి మళ్లీ అవకాశం ఇస్తే గెలుపు మరింత సులభమవుతుందని కేడర్ గట్టిగా భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు.. అభిప్రాయ సేకరణలో అందరూ ఏకాభిప్రాయంతో లేరని సమాచారం. కొంతమంది నాయకులు మాత్రం "పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ కేటాయించినా మాకు అభ్యంతరం లేదు, పార్టీ నిర్ణయమే శిరోధార్యం" అని స్పష్టం చేశారు. మరికొంత మంది మాత్రం ఒకవేళ రామచందర్ రావు కాకపోతే పలానా వ్యక్తికి అవకాశం ఇవ్వాలని ప్రత్యామ్నాయ అభ్యర్థుల పేర్లను సూచించారు. అయితే ఇలా సూచించిన వాళ్ళ సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ, మెజారిటీ నాయకుల మద్దతు రామచందర్ రావు వైపు ఉండటంతో బీజేపీ వర్గాల్లో ఆయన పేరే ప్రధానంగా వినిపిస్తోంది. అభిప్రాయ సేకరణ కమిటీలు సేకరించిన ఈ నివేదికను త్వరలోనే రాష్ట్ర నాయకత్వం ద్వారా కేంద్ర పార్టీ అధిష్ఠానానికి నివేదించనున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న తరుణంలో, అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

# వివాదంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి !

**హైదరాబాద్ అక్టోబరు 15:**జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్ రెడ్డి కుటుంబం , జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మధ్య వివాదం ముదిరింది. వీసీ భార్య సుజనా రెడ్డి తనపై చేసిన ఫిర్యాదులోని ఆరోపణలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత నెల 8వ తేదీన పోలీస్ స్టేషన్‌లో తనను తిట్టినట్లు, బెదిరించినట్లు సుజనా రెడ్డి చేసిన వాదనలు పూర్తిగా అవాస్తవమని, అసలు ఆమె ఎవరో కూడా తనకు తెలియదని, ఎప్పుడూ చూడలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థను వివాదాల్లోకి లాగుతూ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ వివాదానికి అసలు మూలం వీసీ తీరుపై మహిళా ప్రొఫెసర్లు చేసిన ఫిర్యాదేనని పల్లా రాజేశ్వర్ రెడ్డి వెల్లడించారు. తాను జేఎన్‌టీయూ వీసీకి ఫోన్ చేసినప్పుడు ఆయన బాత్‌రూమ్‌లో ఉండటంతో వేరే వ్యక్తి ఫోన్ ఎత్తి మాట్లాడారని, తాను వీసీతోనే మాట్లాడతానని చెప్పి ఫోన్ పెట్టేసినట్లు తెలిపారు. ఆ తర్వాత వీసీతో మాట్లాడినప్పుడు... సీనియర్ ప్రొఫెసర్లను, ముఖ్యంగా మహిళా ప్రొఫెసర్లను తీవ్ర పదజాలంతో దూషించడానికి కారణమేమిటని తాను నిలదీసినట్లు చెప్పారు. తనపై ఏమైనా కోపం ఉంటే నేరుగా తనను ప్రశ్నించవచ్చు కానీ, మహిళా ఆచార్యుల పట్ల అలా వ్యవహరించడం తప్పు కదా అని అడిగినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సంభాషణ సమయంలో తన తప్పును అంగీకరించిన వీసీ కిషన్ కుమార్ రెడ్డి క్షమాపణ కోరారని, తిరుపతి నుంచి తిరిగి వచ్చిన తర్వాత దీనిపై లిఖితపూర్వకంగా లేఖ ఇస్తానని చెప్పారని పల్లా తెలిపారు. అయితే మరుసటి రోజు సాయంత్రం వరకు వీసీ నుంచి ఎలాంటి లేఖ రాకపోవడంతో, బాధితులైన మహిళా ప్రొఫెసర్లు స్వయంగా వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నుంచి దృష్టి మళ్లించేందుకే వీసీ తన భార్యను అడ్డుపెట్టుకుని తనపై వ్యతిరేక ఫిర్యాదు చేయించారని ఆయన ఆరోపించారు. మరోవైపు వీసీ కుటుంబం మాత్రం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తమను ఫోన్ ద్వారా బెదిరించారని, తప్పుడు కేసులు పెట్టిస్తానంటూ హెచ్చరించారని ఆరోపిస్తూ పోలీసులను ఆశ్రయించింది. అయితే ఈ వ్యవహారంలో నిజానిజాలు నిగ్గు తేల్చడానికి పోలీసులు కేవలం ఒకరి



మాటలకే పరిమితం కాకుండా, సంబంధిత సీసీటీవీ ఫుటేజీలు, కాల్ రికార్డులు, మహిళా ప్రొఫెసర్లతో వీసీ దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. వర్సిటీ పరువును బజారుకీడ్చేలా సాగుతున్న ఈ పరిణామాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయ , విద్యావర్గాల్లో కలకలం రేపుతున్నాయి.

# ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి...

- మొదటి పేజీ తరువాయి

సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సీఎస్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా రూపొందించిన ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే 15 రోజుల నీటి లభ్యతను అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు పంటలపై చూపే ప్రభావాన్ని వ్యవసాయ, విద్యుత్, సాగునీటి శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు, స్థానిక ప్రజలను కలిసి వారి అవసరాలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి..

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్‌పై రాహుల్ గాంధీ పిటిషన్..

- మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సాంకేతిక నిపుణులు, ప్రముఖ పౌరులతో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఓటరునైనా ముందస్తు నోటీసు ఇవ్వకుండా, తన వాదన వినిపించే అవకాశం కల్పించకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పంజాబ్‌తో పాటు ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాల్లో అర్హులైన ఓటర్లు చట్టం అనుమతించిన చివరి తేదీ వరకు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పిటిషన్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కూడా అభ్యర్థించారు. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ ప్రసాద్ యాదవ్, సౌగతా రాయ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, డి.రాజా తదితరులు ఈ పిటిషన్‌లో సహ పిటిషనర్లుగా ఉన్నారు. మరోవైపు, జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశంగా గుర్తించిన హోదాను తొలగించడాన్ని సవాలు చేస్తూ స్వాతి సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రాంగణంతో పాటు సంబంధిత ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ఆదేశించింది. అక్టోబర్ 10న ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో నిరసనలు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రాకపోకలకు అంతరాయాలపై దాఖలైన ఇతర పిటిషన్లను కూడా ధర్మాసనం విచారించింది.

## గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- మొదటి పేజీ తరువాయి

విజయవంతం చేయాలని తెలిపారు. ఏర్పాట్ల విషయంలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీపై ప్రత్యేక దృష్టి. హుస్నాబాద్ నియోజకవర్గంలో దివ్యాంగులు, వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీ కోసం ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ప్రత్యేక శిబిరాల నిర్వహణపై సమాచారం క్షేత్రస్థాయి వరకు చేరిందా? అనే అంశాలపై మంత్రి అధికారులను ఆరా తీశారు. గ్రామాల్లో డప్పు చాటింపుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అందించే సహాయక పరికరాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఒక్క అర్హుడైన లబ్ధిదారుడు కూడా మిస్ కాకుండా గుర్తించి, ప్రతి ఒక్కరికీ సహాయక పరికరాలు అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, హనుమకొండ జిల్లాలో రెండు మండలాలకు ఒక రోజు, సిద్దిపేట జిల్లాలో మూడు మండలాలకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శిబిరాల నిర్వహణకు ముందుగానే అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించి పూర్తి స్థాయి డేటా సిద్ధం చేయాలని తెలిపారు. అర్హులైన వారందరూ శిబిరాలకు హాజరయ్యేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్డీఓ, పీడీ, డీడబ్ల్యూఓలతో పాటు జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయక పరికరాలు అందించడంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## విదేశీ బొగ్గు దిగుమతితో సింగరేణికి మరణశాసనం..

- మొదటి పేజీ తరువాయి

చేసేందుకు సింగరేణిలో +9 బొగ్గు లేదని అబద్ధాలు చెప్పడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థకు రూ.60 వేల కోట్ల బాకీ చెల్లించకుండా సంస్థను కుప్ప కూల్చే కుతంత్రం చేస్తున్నారని రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. దేశీయ సంస్థలను పక్కనపెట్టి కమీషన్ల కోసమే విదేశీ బొగ్గు కోసం వెంపర్లాడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కమీషన్ల ముసుగులో ప్రతి టన్నుపై రూ.1,500 చొప్పున ఏకంగా రూ.3,000 కోట్ల దోపిడీకి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రంగం సిద్ధం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. దీనిని అడ్డుకోవాల్సింది పోయి సహకరిస్తున్నారంటూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణిని బలహీనపరిచి.. విదేశీ బొగ్గు దిగుమతికి జరుగుతున్న కుట్రలను చూస్తూ ఊరుకోబోమని రేవంత్ సర్కార్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

## రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ ఆధిపత్యం

- మొదటి పేజీ తరువాయి

ఈ అంశాన్ని ప్రస్తావించారు. పెండింగ్లో ఉన్న విభజన సమస్యల పరిష్కారానికి ఉమ్మడి రాష్ట్ర నాయకత్వం చొరవ చూపాలని ఆయన కోరారు. అయితే, దీనిని తెలంగాణ ప్రభుత్వం కేవలం కాలయాపన కార్యక్రమంగా చూస్తోంది. అంతేకాక, ఏపీకి అనుకూలంగా చట్టాన్ని మార్చే ప్రయత్నంగా అనుమానిస్తోంది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలను యథాతథంగా అమలు చేయాలని, లొకేషన్ ఆధారంగా ఆస్తుల విభజన జరగాలని తెలంగాణ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది. ఈ విభేదాల వెనుక బలమైన రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయి. షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనలో, అలాగే చట్టంలో ప్రత్యేకంగా పేర్కొనని సంస్థల విషయంలో గతంలోనే తమకు అనుకూలంగా కొన్ని నిర్ణయాలు వచ్చాయని తెలంగాణ వాదిస్తోంది. ఇప్పుడు 'గివ్ అండ్ టేక్' పేరుతో వాటిని తప్పిస్తారని తెలంగాణ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు.. ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులకు సంబంధించి పబ్లిక్ డెట్ విభజనలో జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలని విభజన చట్టం స్పష్టం చేసింది. అయితే.. ఏపీ మాత్రం లొకేషన్, యుటిలైజేషన్, జనాభా ప్రాతిపదికన వేర్వేరు పద్ధతులను ప్రతిపాదించిందని తెలంగాణ ఆరోపిస్తోంది. ఈ వివాదం కేవలం అధికారుల స్థాయికే పరిమితం కాకుండా రాజకీయ వేడిని రాజేసింది. కేంద్ర ప్రభుత్వం ఏపీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరించి, తెలంగాణ నుంచి రావాల్సిన మొత్తాన్ని రికవర్ చేయాలని ఆదేశించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చట్ట నిబంధనలను దాటి 'గివ్ అండ్ టేక్' ముసుగులో ఏపీ ఆర్థికంగా లబ్ది పొందాలని చూస్తోందని తెలంగాణ గట్టిగా వాదిస్తోంది. మొత్తంగా చూస్తే.. రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ ఆధిపత్యం, ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం ఈ విభజన అంశాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. చట్టం ప్రకారం హక్కులను కాపాడుకోవాలని తెలంగాణ భావిస్తోంది. అదే సమయంలో పరస్పర అంగీకార మార్గాలను అన్వేషించాలని ఏపీ ప్రతిపాదిస్తోంది. మరి ఈ ప్రతిష్టంభన రాబోయే రోజుల్లో ఏ రాజకీయ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

## న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

- మొదటి పేజీ తరువాయి

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది గౌరవ్ భాటియా సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఇండియా కూటమి చేపట్టిన నిరసన అంశాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. 'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు' అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రదర్శన ద్వారా న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించారన్న వాదనపై స్పందిస్తూ.. అవన్నీ బలహీనమైన ప్రయత్నాలేనని పేర్కొన్నారు. బయట రాజకీయ నాయకులు చేసే ప్రకటనలను తాము గమనిస్తూనే ఉన్నామని, సమాజంలో జరుగుతున్న పరిణామాలు తెలియకుండా తాము లేమని వ్యాఖ్యానించారు.

**రాహుల్ గాంధీ, అఖిలేశ్‌కు నోటీసులు..**

సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌పై కూడా ధర్మాసనం విచారణ జరిపింది. ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తోపాటు ఇతర నేతలకు నోటీసులు జారీ చేసింది.

# ఆ హోటల్ ఆదాయం రోజుకు రూ.75 లక్షలు..

**కేటీఆర్‌పై వెంకట్ బల్మూర్ తీవ్ర ఆరోపణ**

**హోటల్ ఆదాయం రూ.5 కోట్ల నుంచి రూ.175 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్న**

**మంత్రిగా ఎంఎన్సీలను బెదిరించి వ్యాపారం చేశారని ఆరోపణ**

**ఆరోపణలపై చర్చకు సిద్ధమని కేటీఆర్‌కు సవాల్**

**త్వరలో సిరిసిల్ల బాగోతం కూడా బయటపెడతానన్న బల్మూరి**




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై శాసనమండలి ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. గతంలో చెప్పినట్టుగానే కేటీఆర్ చీకటి బాగోతాలను వరుసగా బయటపెడుతూనే ఉంటానని, అందులో భాగంగానే ఆయన హోటల్ వ్యాపారానికి సంబంధించిన కొన్ని విషయాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు. రూ.5 కోట్ల షేర్ విలువ ఉన్న డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయం పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై తాను ఆరా తీయగా విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయని బల్మూర్ అన్నారు. కేటీఆర్ ఐటీ మంత్రిగా, షాడో ముఖ్యమంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బహుళజాతి సంస్థ (వీచీజ)లను బెదిరించి, తమ కంపెనీలకు చెందిన ఫుడ్, ఈవెంట్స్, మీటింగ్స్ వంటివి తన హోటల్‌లోనే నిర్వహించేలా ఒప్పందాలు చేయించుకున్నారని విమర్శించారు. ఈ ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఇది కేటీఆర్, ఆయన టీమ్ చేస్తున్న నయా దందా అని అభివర్ణించారు. ఆ హోటల్ రోజువారీ ఆదాయం సుమారు రూ.75 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తాను చేసిన ఆరోపణలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని బల్మూర్ స్పష్టం చేశారు. కేటీఆర్‌కు దమ్ముంటే తన ఆరోపణలపై స్పందించాలని సవాల్ విసిరారు. అంతేకాకుండా, త్వరలోనే కేటీఆర్‌కు సంబంధించిన "సిరిసిల్ల చీకటి బాగోతం" కూడా బయటపెడతానని వెంకట్ బల్మూర్ హెచ్చరించారు.

## కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు..

# పచ్చి దోపిడీ: కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, అక్టోబర్15:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి మండిపడ్డారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అంటూ అభివర్ణించారు. అనుచరులు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు నిబంధనల ఉల్లంఘనలు అని విమర్శించారు. అర్హతలు లేని వారికి కమీషన్ల కోసం పనులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఆగడాలు ఏమిటని ప్రభుత్వాన్ని ఆమె సూటిగా ప్రశ్నించారు.కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడేవారిని వదిలిపెట్టబోమని కవిత హెచ్చరించారు. తెలంగాణలోనూ మహిళా రైతుల సాధికారత చట్టం తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రైతులకు, రైతు కూలీలకు చట్టపరమైన గుర్తింపు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళా రైతులకు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత తదితర ప్రయోజనాలు అందించాలని రేవంత్ ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు.

# హైదరాబాద్ మెట్రో అనాథ !



**హైదరాబాద్ అక్టోబరు 15:**దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, వ్యాపార హబ్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం.. మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ విషయంలో మాత్రం ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే వెనుకబడిపోతోంది. ఢిల్లీ 390 కిలోమీటర్లకు పైగా ట్రాక్‌తో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు వేల కోట్ల కేంద్ర నిధులతో తమ రెండో, మూడో దశ పనులను శరవేగంగా పట్టాలెక్కిస్తున్నాయి. కానీ భాగ్యనగరంలో మొదటి దశ 69 కిలోమీటర్ల మేర పూర్తయి ఏళు గడుస్తున్నా, రెండో దశ విస్తరణ మాత్రం ఫైళ్ల దశను దాటి పూర్తిస్థాయిలో పట్టాలెక్కలేదు. కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 38 వేల కోట్లకు పైగా అంచనాతో 122 కిలోమీటర్ల పైబడిన ఫేజ్-2 డీపీఆర్‌లను కేంద్రానికి సమర్పిస్తున్నప్పటికీ.. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి రావాల్సిన కీలక ఆమోదాలు, నిధుల భాగస్వామ్యంపై ఏకాభిప్రాయం రావడం లేదు. ఉత్తరాది నగరాల ప్రాజెక్టులకు, మహారాష్ట్ర, గుజరాత్ మెట్రో నెట్‌వర్క్‌లకు కేంద్ర బడ్జెట్‌లలో వేల కోట్ల రూపాయలను కేటాయిస్తున్న మోదీ సర్కార్.. దేశానికే భారీగా పన్నులు చెల్లిస్తున్న హైదరాబాద్ మెట్రో విషయానికి వచ్చేసరికి మాత్రం కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.హైదరాబాద్‌కు గనక సమగ్రమైన ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు అందితే.. అది ముంబై, బెంగళూరులను సైతం వెనక్కి నెట్టి దేశంలోనే అగ్రగామి నగరంగా అవతరిస్తుందన్న వాస్తవం కేంద్ర పెద్దలకు తెలియంది కాదు. తక్కువ జీవన వ్యయం, మెరుగైన శాంతిభద్రతలు, ఐటీ-ఫార్మా రంగాల్లో అపార అవకాశాలు ఉన్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా మెట్రో పూర్తయితే అంతర్జాతీయ పెట్టుబడులన్నీ ఇక్కడికే పోటెత్తుతాయి. అందుకే, ఇతర రాష్ట్రాల నగరాల పోటీతత్వాన్ని కాపాడేందుకు హైదరాబాద్‌పై ఆర్థిక, మౌలిక వసతులపరమైన ఆంక్షలు పరోక్షంగా అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.రాజకీయ నాయకత్వ బలహీనతలు, కేంద్ర వివక్ష కారణంగా అంతిమంగా నష్టపోతున్నది సామాన్య హైదరాబాద్ పౌరుడే. ట్రాఫిక్ రద్దీతో నిత్యం నరకం చూస్తున్న ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు మెట్రో విస్తరణ కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కేంద్రం హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్రం తక్షణమే సంపూర్ణ అనుమతులు మంజూరు చేసి, తన వాటా నిధులను విడుదల చేయాల్సిన చారిత్రక అవసరం ఉంది. లేకపోతే దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మహానగరానికి అన్యాయం చేసినట్లే అవుతుంది

# ఓట్ల తొలగింపుపై గల్లీ మౌనం

## రోడ్డెక్కని బాధితుల పోరాటాలు!




**హైదరాబాద్ అక్టోబరు 15:** తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఊహించని రీతిలో రికార్డు స్థాయి ఓట్ల కోతకు దారితీస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఉన్న సుమారు 3.38 కోట్ల ఓటర్ల జాబితాలోంచి ఏకంగా 73.39 లక్షల ఓట్లను అంటే దాదాపు 21.7% పైగా తొలి విడత డ్రాఫ్ట్ రోల్‌లోనే తొలగించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరణించినవారు 9.22 లక్షలు , శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు 45.18 లక్షలు , అడ్రస్‌లో లేనివారు 11.25 లక్షలు , రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు 6.70 లక్షలు అనే వర్గీకరణ కింద ఈ భారీ ఓట్ల తొలగింపు జరిగింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే దాదాపు 40 లక్షలకు పైగా ఓట్లు మాయమయ్యాయి.ఇంత భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతుంటే, ప్రజాస్వామ్యంలో రావాల్సిన స్థాయి ఆందోళన గానీ, ప్రజా ఉద్యమం గానీ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిళ్లలోపెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా ఓటర్ల జాబితాలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా వీధుల్లో ధర్నాలు చేసే రాజకీయ పార్టీలు.. ఈ ఐదేళ్లలో ఐదో వంతు ఓట్లు 22% గాల్లో కలిసిపోతున్నా వీధి పోరాటాలకు ఎందుకు దిగడం లేదు? ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్షాలు , జాతీయ నేతలు నిరసనలు, ప్రెస్ మీట్లు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ వేడి తెలంగాణ గల్లీలకు ఎందుకు చేరడం లేదు?ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిపై ప్రధానంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోఉన్నప్పటికీ, సీఈవోకు వినతిపత్రాలు ఇవ్వడం, బోగస్ ఫారమ్-7 అప్లికేషన్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని పోలీసు అధికారులను కలవడానికే పన్ను పరిమితమైంది. నిజమైన ఓటర్లను ప్రజాసమీకరణ ద్వారా వీధుల్లోకి తెచ్చి చైతన్యవంతం చేయడంలో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందనే అభిప్రాయం ఉంది. కేవలం హైదరాబాద్‌లోని ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ లాంటి నియోజకవర్గాలకే తమ ఫిర్యాదులను పరిమితం చేస్తూ, సచివాలయం, గాంధీ భవన్ గదులకే కాంగ్రెస్ పోరాటం పరిమితమైందనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. తొలగించిన ఈ ఓటర్లు నిజంగా అర్హులైన ప్రతినిధులేనా అనే అనుమానం ఎక్కువగా ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఐటీ కారిడార్లలో నివసించే వారిలో అత్యధికులు ఏపీకి చెందిన డబుల్ ఓటర్లు, లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన ఐటీ, వలస కార్మికులు. ఈ ఓటర్లలో మెజారిటీ వర్గం ఎన్నికల రోజున కనీసం పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసే ఆసక్తి చూపించకపోవడం, లేదా స్వగ్రామాలకు వెళ్లిపోతుండటంతో.. వారి ఓట్లు మాయమైనా సాధారణ ప్రజల్లోనూ, స్థానిక క్యాడర్‌లోనూ ఎలాంటి పట్టింపు కనిపించడం లేదు.పక్కాగా దొంగ ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని భావిస్తున్న స్థానిక ప్రజలు, దీనిని తమ హక్కుల భంగంగా చూడటం లేదు. కేవలం బిఎల్ఓ అధికారులు ఇంటింటికీ రాకుండా ఫంక్షన్ హాళ్లలో కూర్చుని నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని వార్తలు వస్తున్నప్పటికీ, బాధితుడు స్వయంగా స్పందించి ఫారమ్-6 దాఖలు చేసుకునే స్థితిలో లేకపోవడమే ఈ నిశ్శబ్దానికి ప్రధాన కారణం. ఢిల్లీ రాజకీయాల్లో రాజ్యాంగ పరిరక్షణ, ఓట్ చోరీ నినాదాలు ప్రచార ఆయుధాలుగా మారినప్పటికీ, తెలంగాణ క్షేత్రస్థాయిలో ప్రజలు దీనిని ఒక రొటీన్ పరిపాలనా ప్రక్రియగా చూడటమే వ్యత్యాసానికి మూలం. 70 లక్షల ఓట్ల కోత అనేది చిన్న విషయం కాకపోయినప్పటికీ, ప్రజాస్వామ్య హక్కులపై గ్రాస్ రూట్ స్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, పౌర సమాజం విఫలమవడమే ఈ నిశ్శబ్దానికి సంకేతం.

# సింగరేణిలో వేడెక్కుతున్న రాజకీయం..!




**హైదరాబాద్ అక్టోబరు 15:**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. ఆ తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలకు నగారా మోగనుంది. అయితే ఈ లోపే సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు రాజకీయ పార్టీలను అప్రమత్తం చేశాయి. వేలాది మంది కార్మికుల కుటుంబాలు సింగరేణి ఆధారంగా పనిచేస్తున్నారు. ఇలాంటి ఎన్నికల్లో గెలవడం ద్వారా సత్తా చాటాలని రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి.సింగరేణి సంస్థలో సుమారు 40 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కోల్‌బెల్ట్ ప్రాంతం దాదాపు 13 అసెంబ్లీ స్థానాల పరిధిలో విస్తరించి ఉంది. ఇక్కడి కార్మికులు, వారి కుటుంబాల ప్రభావం ఎన్నికల ఫలితాలపై గట్టిగా ఉంటుంది. అందుకే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. గతం నుంచి కూడా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన పార్టీనే ఆయా ప్రాంతాల్లో రాజకీయంగా పైచేయి సాధిస్తుందనే బలమైన నమ్మకం రాజకీయ వర్గాల్లో ఉంది.గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే యూనియన్ ఎన్నికలు జరుగాయి. అయితే ఇప్పుడు రాజకీయ సమీకరణాలు మారాయి. నవంబర్ లేదా డిసెంబర్ నాటికి ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించి ఇప్పటికే న్యాయస్థానంలో వివిధ సంఘాలు వేసిన పిటిషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ వైఖరి, కోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఎన్నికల షడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. అందుకే కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాలు గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేశాయి.ఎన్నికలు రాబోతున్నాయన్న సంకేతాలు రావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు కార్మికులను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. కార్మికుల ఓట్లను రాబట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ చర్యలపై దృష్టి సారించింది. కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలు, గృహ నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న సింగరేణి ఇళ్ల పట్టాల సమస్యల పరిష్కారం వంటి హామీలతో కార్మికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. దసరా పండగవేళ ప్రకటించిన భారీ బోనస్ కూడా తమకు కలిసొస్తుందని నమ్ముతోంది.ఇక.. ప్రతిపక్ష బీఆర్ఎస్ దూకుడు మీదుంది. గల్ఫ్, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో తమకు మంచి పట్టు ఉందని ఆ పార్టీ నమ్ముతోంది. దాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే అనుబంధ సంఘం అయిన టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మిక గర్జనలు, బహిరంగ సభలను నిర్వహిస్తోంది. ఇవాళ చలో సింగరేణికి పిలుపునిచ్చిన ఆ పార్టీ... సింగరేణి సంస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వంపై ఎక్కుపెడుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పాటు బీజేపీ అనుబంధ సంఘాలు అలాగే లెఫ్ట్ పార్టీల అనుబంధ యూనియన్లు కూడా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. కార్మికుల సమస్యలపై గళం విప్పుతున్నాయి. మంచిర్యాల, చెన్నూరు, రామగుండం వంటి కోల్‌బెల్ట్ ప్రాంతాలు ప్రధాన రాజకీయ పార్టీల కార్యకలాపాలతో హోరెత్తుతున్నాయి.గతంలో సింగరేణి ప్రాంతంలో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన శక్తులు నేడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కేవలం వేతన ఒప్పందాలు, బోనస్‌లు మాత్రమే కాకుండా కార్మికుల సర్వతోముఖాభివృద్ధి, ఉద్యోగ భద్రత, జీవన ప్రమానాల మెరుగుదల ఈ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. రాబోయే రోజుల్లో రానున్న సింగరేణి ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో రాబోయే పరిణామాలకు ఒక దిక్సూచిగా నిలవనున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కరెంట్ కోతలకు

# మీ వైఫల్యమే కారణం..

**రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!**

**బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ**

**ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ**

**అధికారులపై నెపం నెడుతున్నారని సీఎం తీరుపై విమర్శ**

**నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు**

**ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక**



తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

## డివైడర్ ను ఢీకొన్న కారు..ప్రయాణికులు ధ్వంసం

**హైదరాబాద్:**పాతబస్తీలోని కంచన్ బాగ్ పోలీసు పరిధిలో బాబానగర్ లొ రోడ్డు ప్రమాదం జరిగింది. బాబానగర్ ఫంక్షన్ హాల్ దగ్గర ఒక మహింద్రా కారు డివైడర్ ను ఢీకొని రోడ్డు పక్కనున్న గుంతలో పడింది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు ప్రయాణికులు వున్నట్లు సమాచారం. ఘటన తరువాత డ్రైవర్ పారిపోయాడు. ప్రయాదంలో ఎవరికీ గాయాలు కానప్పట్టికి కారు పూర్తిగా ధ్వంసమయింది

## ప్రమాదవశాత్తు హోంగార్డు మృతి

**తిరుపతి:**బ్రహోత్సవాల బందోబస్తుకు వచ్చిన ఒక హోం గార్డు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అనంతపురం నుండి తిరుపతికి వచ్చిన హోంగార్డు జయసింహ, శ్రీనివాసమ్ బాత్రూంలో కాలు జారిపడి మృతి చెందాడు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో డ్యూటి చేసేందుకు ఈనెల 12న తిరుపతికి చేరుకున్న జై సింహా 13 ఉదయం బాత్రూం లోకి వెళ్లి కాలుజారిపడి తలకు గాయం అయింది. అక్కడే మృతి చెందాడు. ఆలస్యంగా సమాచారం తెలుసుకున్న ఈస్ట్ పోలీసులు మృతదేహాన్ని రుయా మార్చురీ తరలించారు. విషయం తెలుసుకున్న అనంతపురం పోలీసులు ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్సై స్వాతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దేశం వదిలివెళ్లాలన్న నోటీసుపై బాంబే హైకోర్టుకు ఇమ్రాన్

**ఇంటర్‌నెట్ డెస్క్:** దేశం వదిలివెళ్లాలని తనకు జారీ చేసిన నోటీసును నటుడు, ఆమిర్ ఖాన్ అల్లుడు ఇమ్రాన్ ఖాన్.. బాంబే హైకోర్టులో సవాలు చేయనున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అవకతవకల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు, సీజేపీ నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఇమ్రాన్ పాల్గొన్నారు. ముంబైలోని క్రాంతి మైదాన్‌లో జరిగిన ప్రదర్శనకు ఆయన సంఘీభావం తెలిపారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ఈనెల 28 లోపు దేశం విడిచివెళ్లాలని అధికారులు ఆయనకు నోటీసు పంపారు. ఖాన్ అమెరికా జాతీయుడని, ఓవర్‌సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు దేశంలో ఎలాంటి నిరసన ప్రదర్శనలో పాల్గొనరాదని, ఆ నిబంధనలను ఇమ్రాన్ ఉల్లంఘించినందున దేశం విడిచివెళ్లాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఆ నోటీసుపై ఇమ్రాన్ ఖాన్ తరపున ఆయన అడ్వొకేట్ జుల్ఫికర్ మెమన్ శుక్రవారం లేదా సోమవారం (ఈనెల 19) బాంబే హైకోర్టులో సవాలు చేయనున్నారు. ఓసీఐ కార్డు ఉన్నంతమాత్రాన దేశంలో నిరసన ప్రదర్శనల్లో పాల్గొనరాదనే నియమం ఏమీ లేదని మెమన్ అన్నారు. ఈనెల 28 లోపు దేశం వీడివెళ్లాలని తన క్లైంట్ ఇమ్రాన్‌కు ముంబై పోలీసులు జారీ చేసిన నోటీసు తీవ్రమైనదని ఆయన చెప్పారు.

వార్తాతరంగాలు

శుక్రవారం 16 అక్టోబర్ 2026

# శ్రీమహాలక్ష్మి అలంకారంలో ఏడుపాయల వనదుర్గామాత.. దర్శనానికి పోటెత్తిన భక్తులు!

**ఐదో రోజు నవరాత్రి ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తజనం.. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లింపు**

**పాపన్నపేట/మెదక్ , అక్టోబర్ 15, (స్కై న్యూస్ ప్రతినిధి ):** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల శ్రీ వనదుర్గామాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం అమ్మవారు శ్రీమహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**శ్రీమహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు**

నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారిని వివిధ పుష్పాలు, ఆకర్షణీయమైన అలంకరణలతో సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన వనదుర్గామాతను చూసి భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.

**ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు**

నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఏడుపాయల క్షేత్రానికి తరలివచ్చారు.



ప్రత్యేక మండపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**అమ్మవారికి బోనాలు.. భక్తుల మొక్కులు**

ఐదో రోజు నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఏడుపాయల పుణ్యక్షేత్రం సందడిగా మారింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు**

నవరాత్రి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, దీపక్ రెడ్డి, బలరాంతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతుండటంతో ఏడుపాయల క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# జాతీయ మానవ హక్కులు మరియు నియంత్రణ బ్యూరో తెలంగాణ సెక్రటరీగా దుడ్డు ఆంజనేయులు...

**ఆమనగల్లు,అక్టోబర్15 (స్కై న్యూస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ, జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుడ్డు ఆంజనేయులు జాతీయ మానవ హక్కులు మరియు నేర నియంత్రణ బ్యూరో (ఎన్ హెచ్ ఆర్ సి సిబి) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ నియామకం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలను అప్పగించిన సంస్థ జాతీయ అధ్యక్షులు రణధీర్ కుమార్ కి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులకు, రాష్ట్రస్థాయి నాయకులకు, సంస్థ ప్రతినిధులకు మరియు కమిషన్ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా దుడ్డు ఆంజనేయులు మాట్లాడుతూ, తనకు అప్పగించిన పదవికి పూర్తి న్యాయం చేస్తూ, మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ తమ హక్కులపై అవగాహన కల్పించడం, హక్కులకు భంగం కలిగిన బాధితులకు న్యాయం అందించే దిశగా తన వంతు కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ, మానవ హక్కుల పట్ల అవగాహన పెంపొందించేందుకు, సమాజంలో న్యాయం, సమానత్వం, సామాజిక బాధ్యత వంటి విలువలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ నాయకత్వానికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ, సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని దుడ్డు ఆంజనేయులు తెలిపారు. జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుడ్డు ఆంజనేయులు తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులు కావడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.



# ఆర్థిక ప్రయోజనాలకు పశుసంపదపై దృష్టి సారించాలి

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 15( స్కై న్యూస్)** రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు వ్యవసాయంతో పాటు పశు సంపదపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పశు వైద్యాధికారి డాక్టర్ పి అశోక్ శ్రీపురం గ్రామ సర్పంచ్ గీతా నరసింహారెడ్డి సూచించారు గురువారం శ్రీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పశువు గర్భకోశ చికిత్స మరియు ఆరోగ్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ పి అశోక్ ఆధ్వర్యంలో పలు పశువులకు చికిత్సలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు మరియు గర్భ నిర్ధారణ పరీక్షలు వైద్య శిబిరంలో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడూరు మండల పశు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ గోపాలమిత్ర సూపర్వైజర్ గోపాల్ గోపాలమిత్ర రాజేందర్ రెడ్డి పట్టు వైద్య సిబ్బంది మాధ్య నాయక్ వినయ్ సనా సుల్తానా మక్బూల్ తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు



# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి

**ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి నేరుగా వేతనాలు చెల్లించాలి**

**ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి సంఘీభావం**

**మెదక్, అక్టోబర్ 15,(స్కై న్యూస్ ప్రతినిధి ):** కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలందించిన జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సేవలు అమోఘమని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కరోనా విపత్కర సమయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలందించారని కొనియాడారు. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతంలో, ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కూడా ఉందని, వారి సేవలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి నిరసన తెలుపుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి,మధ్యవర్తి ఏజెన్సీల ప్రమేయం లేకుండా స్టేట్ హెల్త్ వ్యవస్థ ద్వారా ఉద్యోగులకు నేరుగా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఏళ్ల తరబడి వైద్య ఆరోగ్య శాఖలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ఏటా ఐదు శాతం ఇంక్రిమెంట్, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ మంజూరు చేయాలని



డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చూపాలని సూచించారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఉద్యోగులతో నేరుగా చర్చలు జరిపి, వారి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని, ఉద్యోగి మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా రూ.20 లక్షల బీమా సౌకర్యాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 60, 1195 ప్రకారం పెంచిన వేతనాలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చెల్లించాలని కోరారు. ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని సూచించారు. ఉద్యోగుల వేతనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వారితో చర్చలు జరిపి తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం



ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ఉద్యోగులు అందించిన సేవలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, వారిని క్రమబద్ధీకరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్,కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్,మాయ గంగామణి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, గంగా నరేందర్, శంకరంపేట మాజీ జెడ్పీటీసీ మాధవి రాజు, మెదక్,శంకరంపేట,పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు ఎం. అంజాగౌడ్,పట్లోరి రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి,నాయకులు కృష్ణ గౌడ్,లింగా రెడ్డి,ప్రభు రెడ్డి, మాయ.మల్లేశం,కిష్టయ్య, సాయి,ప్రభాకర్,సుదర్శన్,రవి, నరేందర్‌రెడ్డి,బీరయ్య, కసాపురం.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు డిఏలు ఒకేసారి చెల్లించాలి

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 15 (స్కై న్యూస్):** ప్రభుత్వం ప్రకటించిన రెండు డీఎలను నగదుగా ఒకేసారి చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జోగులాంబ గద్వాల జిల్లా శాఖ డిమాండ్ చేస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు పెంచిన డి ఏ ఏరియ ర్స్ ఒకే విడతలో ఇవ్వాలనిఈ కోసం ఉద్యోగులందరూ పెన్షనర్స్ కలిసి సమైక్యంగా ధర్నా పిలుపు ఇవ్వడం వల్ల రాష్ట్ర ప్రభుత్వము 2023లో ఇవ్వాల్సిన డి ఏ తెలంగాణ ప్రభుత్వం 2026 లో డిఏను మూడు సంవత్సరాలు ఆలస్యంగా ఇవ్వడం వల్ల ఉద్యోగులు లక్షల రూపాయలు నష్టపోయారు అయితే రిటైర్డ్ ఉద్యోగులకు డి ఏ ను వాయిదాల రూపంలో కాకుండా ఒకే చెల్లింపుతో నగదుగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అలాగే పెన్షనర్స్ జీతాల నుండి 1.5 హెల్త్ కార్డుల కోసం తీసుకుంటున్న ప్రభుత్వం ఆ కార్డులు మాత్రం నేటికీ చాలామందికి డౌన్లోడ్ కావడం లేదు కార్డులు ఉన్న వాటిని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనుమతించడం లేదు. కాబట్టి వెంటనే ప్రభుత్వం పెన్షనర్స్ కు వయస్సు రీత్యా చాలా రకాలైన జబ్బులు వస్తూ ఉంటాయి కావున వారికి హాస్పిటల్లో హెల్త్ కార్డులు నూటికి నూరు శాతం అమలు చేయించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బాబు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు మెమోరాండమును సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర ప్రభాకర్ పిటి ప్రకాష్ ఎండి సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి...



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 15 (స్కై న్యూస్):** జిల్లా గద్వాల్ పట్టణం పాత బస్టాండ్ లో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో 78 కేడర్లలో 20 ఏళ్లకు పైగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తూ మూడవరోజుకు చేరిన నిరసన. తమ సేవలను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. కరోనా సమయంలోనూ, మారుమూల గ్రామాల్లోనూ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో చీఎవీ సిబ్బంది కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. అలాగే, క్రమబద్ధీకరణ పూర్తయ్యే వరకు 100 శాతం గ్రాస్ జీతాలు, ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు, వార్షిక ఇంక్రిమెంట్లు, లాయల్టీ బోనస్, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగి మరణిస్తే కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# సంస్కృతి ఉట్టిపడేలా పండగలు జరుపుకోవాలి

**జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**





**నాగర్ కర్నూల్ అక్టోబర్ 15( స్కై న్యూస్)** భక్తిశ్రద్ధలతో పండగలు జరుపుకోవడం వల్ల ఐక్యమత్యం పెంపొందడంతోపాటు సాంస్కృతి సాంప్రదాయాలు కాపాడుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అన్నారు గురువారం జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 56వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా లలితా దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆలయానికి చేరుకున్న ఎస్పీ దంపతులను పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిల్ల కంటి హరిబాబు ఆలయ కమిటీ అధ్యక్షులు విడిదొడ్డి అంజయ్య దంపతులతో పాటు కమిటీల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం దంపతులను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు సందర్భంగా స్థానిక ఎస్సై వెంకట్ రెడ్డి ఆర్యవైశ్య విద్యా కమిటీ చైర్మన్ మిడిదొడ్డి రాజేష్ యువజన సంఘం అధ్యక్షులు నరేష్ బిజెపి పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ కార్యదర్శి హకీం కిషోర్ పిఆర్ఓ శ్యాంసుందర్ ఆలయ పిఆర్ఓ అల్లంపల్లి రమేష్ ఉపాధ్యక్షులు మల్కాపూర్ శేఖర్ డివి నారాయణ వాసవి జర్నలిస్టు నాయకులు మలిపెద్ది రమేష్ తో పాటు పోలీసులు పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ రాష్ట్రపతి జన్మదిన వేడుకలు

**కలాం స్ఫూర్తితో విద్యార్థులు రాణించాలి**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 15( స్కై న్యూస్)** మాజీ రాష్ట్రపతి భారతరత్న అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంలో రాణించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి శ్రీధర్ కోరారు గురువారం ఆయన జయంతిని పురస్కరించుకొని సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం లో పేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం చిన్నతనం నుండి కష్టపడి ఎన్నో అటు పోట్లను ఎదుర్కొని ఉన్నత శిఖరానికి చేరుకున్నారని గుర్తు చేశారు. చిన్ననాటి నుండి పేపర్ బాయ్ గా పని చేస్తూ తన విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ అకుంఠిత దీక్షతో కఠోర శ్రమతో నిరంతరం అధ్యయనం చేస్తూ అత్యంత ప్రతిభాపాటవాలను సాధించారని అన్నారు. ఇస్రో డి ఆర్ డి ఓ లో పనిచేసి అంతరిక్షంలోకి ఎన్నో సాటిలైట్లను పంపగలిగే సమర్థాన్ని దేశానికి కల్పించాలని అగ్ని పృథ్వి లాంటి క్షిపణిలా తయారీలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కలలు కనడంతో పాటు వాటిని నిజం చేసుకునేందుకు అబ్దుల్ కలాం స్ఫూర్తిని తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశెట్టి మండల అధ్యక్షులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి మండల కార్యదర్శి యుగంధర్ రెడ్డి తో పాటు నాయకులు పాండు వెంకటరెడ్డి సాయిరెడ్డి సుదర్శన్ గౌడ్ సంజీవ గౌడ్ పాండురంగయ్య యాదగిరి తదితరులు పాల్గొన్నారు



వార్తాతరంగాలు

శుక్రవారం 16 అక్టోబర్ 2026

# స్వయంకృషితోనే యువత ఎదగాలి

**ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**



**ఆమనగల్లు, అక్టోబర్15 (స్టై న్యూస్):** చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు స్వయంకృషితోనే ఎదిగి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహ చికెన్ సెంటర్, అదేవిధంగా మక్తమాదారం గేటు వద్ద జనరల్ స్టోర్ ను గంప వెంకటేష్ గుప్తా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. నిరుద్యోగులు స్వయంకృషితో, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని అన్నారు. చిన్న వ్యాపారాలే రేపు పెద్ద సంస్థలుగా ఎదుగుతాయని, యువత ఆ దిశగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సేవ్య నాయక్, నరసింహ గౌడ్, ఉప సర్పంచ్ లు శ్రీనివాస్ గౌడ్, పాండు నాయక్, ఆమనగల్లు కౌన్సిలర్ ఎనుమల రమేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్, మాజీ ఎంపిటిసి చంద్రమౌళి, నాయకులు జహంగీర్ అలీ, మాజీ వార్డు సభ్యులు హెచ్ ఆర్ మహేష్, యూత్ వింగ్ అధ్యక్షుడు అంజి, రాములు యాదవ్, భీమ్లా నాయక్, శ్రీకాంత్ యాదవ్, జగదీష్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, గొర్ల వంశీ, కిరణ్ గౌడ్, శేఖర్ గౌడ్, సుదర్శన్ యాదవ్, తిరుపతిరెడ్డి, సాయిబాబా చారి, రాయకంటి, సురేష్, గూడూరు జంగారెడ్డి, గూడూరు శేఖర్ రెడ్డి, రాములు గౌడ్, యాదయ్య గౌడ్, బాల్ రాజ్ , చెన్నకేశవ, అండే కార్ రమేష్, బాలకృష్ణ, వెంకటేష్ స్థానిక నాయకులు, వ్యాపారస్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు అవసరం

**ఆన్లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి**

**విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు సహకరించాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 15(స్టై న్యూస్):** విద్యార్థులకు అత్యుత్తమ బోధన చేసేందుకు ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ ఆన్లైన్ ఇంగ్లీష్ లెర్నింగ్ ఇన్స్టిట్యూట్ కు చెందిన స్పీకర్ రామేశ్వర్ గౌడ్ కొద్ది రోజులుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆన్లైన్లో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తుండగా, గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ఒకరోజు ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించగా జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. అన్ని సబ్జెక్టుల, ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఆన్లైన్ తరగతులను నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలపై అధ్యయనానికి ప్రతి ఏటా కొంతమంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నందున డాక్యుమెంటేషన్, డ్రాఫ్ట్ నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు కూడా ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించుకొని విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. విద్యార్థులు భవిష్యత్తులో పలు పోటీ పరీక్షల్లో రాణించేందుకు, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకునేందుకు స్పోకెన్ ఇంగ్లీష్ ఉపకరిస్తుందన్నారు. వివిధ సబ్జెక్టుల పాఠ్యాంశాలే కాకుండా సాంకేతికతకు సంబంధించి ఎవరైనా సరే ఉపాధ్యాయులు ఇన్నోవేటివ్ గా ఆలోచించి సృజనాత్మక రచనలు చేస్తే బెస్ట్ ప్రాక్టీసెస్ గా గుర్తించి మంత్లీ మ్యాగజైన్ మాదిరి ముద్రించి అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం తరపున కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం తక్కశిల జడ్పిహెచ్ఎస్ లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సుమంగళ రచించిన 'ఫ్రమ జీరో టు హీరో మాథ్స్ మేడ్ ఈజీ' పుస్తకాలను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. స్పీకర్ రామేశ్వర్ గౌడ్ ను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, తదితరులు పాల్గొన్నారు.

### పిట్టలదొర వేషంలో డ్రగ్స్, గంజాయిపై అవగాహన పరిచిన సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 15 (స్టై న్యూస్):** జానపద కళారూపమైన పిట్టలదొర వేషధారణతో సామాజిక చైతన్యం కల్పిస్తున్నారు సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్. షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్ పరిసరాల్లో ఆయన చేపట్టిన కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది. హాస్యభరితమైన మాటలతో ప్రజలను నవ్విస్తూనే గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని సందేశమిచ్చారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మరుగున పడుతున్న జానపద కళలను సామాజిక చైతన్యానికి వేదికగా మార్చడమే తన లక్ష్యమని రాచకొండ ప్రభాకర్ తెలిపారు. యువతలో అవగాహన పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# చిన్నపొర్ల గ్రామ అభివృద్ధిలో మరో ముందడుగు

**గ్రామపంచాయతీ నూతన భవనానికి భూమిపూజ**



**ఊట్కూర్ అక్టోబర్ 15 ( స్టై న్యూస్ ) :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరి సహకారంతో, ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.గ్రామ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన పంచాయతీ సేవలు అందించేందుకు ఈ నూతన భవన నిర్మాణం ఉపయోగకరంగా నిలవనుంది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నికిత ప్రశాంత్. మాజీ సర్పంచ్ మాలిపటేల్ రవీందర్ రెడ్డి. కోరం మహేష్ రెడ్డి.యూత్ కాంగ్రెస్ ఊట్కూర్ మండల అధ్యక్షులు.రాజు అజయ్.కాంగ్రెస్ నాయకులు విగ్నేశ్వర్ రెడ్డి. గ్రామ అధ్యక్షులు బంద్ నవాజ్. డాక్టర్ రఘు. బండి నరేష్. చాకూరు మోబిన్.వీరితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్.హెచ్.ఏం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి...

**- ఉద్యోగ భద్రత కల్పించాలి**

**నారాయణపేట, అక్టోబర్ 15: (స్టైన్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్.హెచ్.ఏం జేఏసి

ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె నారాయణపేట జిల్లాలో గురువారంతో మూడవ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద జిల్లాలోని ఎన్.హెచ్.ఏం ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా మహిళ నాయకులు తమ డిమాండ్లను ముగ్గుల రూపంలో వేసి నిరసన వ్యక్తం చేశారు. వైద్యుల నుంచి కాంటింజెంట్ వర్కర్ల వరకు వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు ఐక్యంగా సమ్మెలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్.హెచ్.ఏం ఉద్యోగులను ప్రభుత్వం ఎప్పుడు రెగ్యులరైజ్ చేస్తుంది, సమాన పనికి సమాన వేతనం ఎప్పుడు అమలు చేస్తుంది, ఉద్యోగ, ఆరోగ్య భద్రత ఎప్పుడు కల్పిస్తుంది అంటూ ఉద్యోగులు ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులు నేటికీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య పనిచేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన





ఉద్యోగులకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ప్రతి సంవత్సరం 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్లు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో పాటు వారి కుటుంబాలకు తగిన ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు.

**ఎన్.హెచ్.ఏం నిరసనలకు బిజెపి మద్దతు...**

బీజేపీ పార్టీ తరపున మద్దతు ప్రకటించిన బిజెపి జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆరోగ్య భద్రతతో పాటు తగిన రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్.హెచ్.ఏం ఉద్యోగులకు అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణలోనూ వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు సంబంధించి స్పష్టతనిస్తూ, ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై సాధ్యాసాధ్యాలను పరిశీలించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబాలను పోషించేందుకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి రాఘవేందర్, ఎన్.హెచ్.ఎం యూనియన్ సభ్యులు డాక్టర్ నరసింహ రావు సగరి, మోనేష్ చారి, శ్రీలత, వెంటరమణ, అనురాధ, తిరుపతి, కిరీటి, శ్వేతశ్రీ, విరోజ, చందన, పుష్ప, సరస్వతి, డీడీఎం స్నేహలత, డిపిఎం మమత తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న విగ్రహా విష్కరణ

**పేదల పక్షాన పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం**

**ముదిరాజ్‌లతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పండగ సాయన్న**

**ముస్లాయిపల్లిలో విగ్రహావిష్కరణ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్ అక్టోబర్ 15( స్టై న్యూస్ ):** అన్యాయాన్ని ఎదిరించి పేదల పక్షాన నిలిచి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర క్రీడా , పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం ముస్లాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సాయన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**పేదల ఆకలి తీర్చిన ప్రజావీరుడు**

పండుగ సాయన్న కేవలం ముదిరాజ్ సామాజిక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిలిచిన ప్రజానాయకుడని మంత్రి పేర్కొన్నారు. ధనవంతులు, భూస్వాములు, పెత్తందారుల దోపిడీని ఎదిరించి వారి ఆధిపత్యానికి సవాల్ విసిరిన ధైర్యశాలి సాయన్న అని కొనియాడారు. ఉన్నవారి సంపదను పేదలకు పంచి, ఆకలితో అలమటించే నిరుపేదలకు అండగా నిలిచిన మహనీయుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. అందుకే ఆయనను ప్రజలు తెలంగాణ రాబిన్‌హుడ్‌గా గుర్తించారని అన్నారు.నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాటం పాలమూరు ప్రాంతానికి చెందిన పండుగ సాయన్న 19వ శతాబ్దంలో భూస్వామ్య దోపిడీ, సామాజిక అసమానతలు, అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడిగా చరిత్రలో





ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని మంత్రి గుర్తుచేశారు. పేదల హక్కుల కోసం నిలబడిన ఆయనను అణచివేయడానికి అప్పటి ఆధిపత్య శక్తులు కుట్రలు పన్ని నిజాం పాలనలో ఆయనకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.సాయన్న వీరగాథలు నేటికీ జానపద కళారూపాలు, ప్రజల కథల్లో సజీవంగా నిలిచి ఉన్నాయని తెలిపారు.ముదిరాజ్ సామాజిక వర్గం ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. యువత విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, రాజకీయ చైతన్యంతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. పండుగ సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం గొప్ప విషయమని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముదిరాజ్ సామాజిక వర్గం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహనీయుల చరిత్రకు గుర్తింపు ఇవ్వడం ద్వారా వారి త్యాగాలు, పోరాటాలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి భావితరాలకు చేరుతుందని పేర్కొన్నారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలన్న నిర్ణయం ఆయనకు దక్కిన సముచిత గౌరవమని అన్నారు.పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ సమాజంలోని పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముస్లాయిపల్లిలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్న మంత్రి, ఈ విగ్రహం గ్రామ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఆయన చరిత్రను గుర్తుచేసే స్ఫూర్తి కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. మహనీయుల ఆశయాలను గౌరవిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

# సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలు

**సంఘీభావం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి: సిఐటియు నేత ఆర్ శ్రీనివాస్**





**నాగర్ కర్నూల్ అక్టోబర్ 15( స్టై న్యూస్)** జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించే వరకు వారు నిర్వహించే పోరాటాలకు అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు అన్నారు గత మూడు రోజులుగా కలెక్టర్ కార్యాలయం ఎదుట వందలాది మంది సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్షల శిబిరానికి బుధవారం వేరువేరుగా వారు చేరుకొని సంఘీభావం ప్రకటించారు ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అనేక పర్యాయాలు కోరిన ఫలితం లేకపోవడం వల్లే రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేయాలని ప్రధాన డిమాండ్ తో ఆందోళన చేపట్టినట్లు వారు తెలిపారు సందర్భంగా మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలతో పాటు వంటావార్పుతో ఆందోళన చేపట్టిన ప్రభుత్వంలో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ నిరంతరం పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంది అని నిలదీశారు క్రమబద్ధీకరణతో భద్రతతో పాటు హక్కులు సాధ్యమవుతాయన్నారు. వెంటనే ప్రభుత్వం వారితో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న సిబ్బంది సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని వెంటనే వాటిని పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. క్రమబద్ధీకరణతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయాలని జీవో నెంబర్ 11 95 పునర్ పరిశీలించాలని కోరారు. సర్వీస్ ప్రయోజనాలను కాపాడడంతో పాటు ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించి ఆదుకోవాలని ఇంక్రిమెంట్లు బోనస్తులు చెల్లించాలని కోరారు ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ హైమావతి రాష్ట్ర కమిటీ సభ్యులు గౌస్ పాషా కల్పన సమన్వయకర్త ప్రవీణ్ నాయకులు భీముడు రామకృష్ణారెడ్డి డాక్టర్ రాజు డాక్టర్ జగన్ తో పాటు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

వార్తాతరంగాలు

శుక్రవారం 16 అక్టోబర్ 2026

# పీఎండీడీకేవై లక్ష్యాల సాధనకు
# అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**వ్యవసాయ ఉత్పాదకత పెంపు మరియు పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**వెనుకబడిన సూచికల్లో పురోగతి సాధించి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి**

**జిల్లాలో యూరియా వినియోగం తగ్గడం అభినందనీయమని, ఇందుకు దోహదపడిన ఉత్తమ పద్ధతులను డాక్యుమెంటేషన్ గా రూపొందించాలి**

**కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి పౌసుమి బసు**

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 15 (స్కై న్యూస్):**పీఎండీడీకేవై లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పీఎండీడీకే జిల్లా నోడల్ అధికారి పౌసుమిబసు అధికారులను ఆదేశించారు.గురువారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన అమలుపై పీఎండీడీకేవై జిల్లా నోడల్ అధికారి పౌసుమి బసు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో పథకం అమలు తీరు,ఇప్పటివరకు సాధించిన పురోగతి,వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో అమలు చేయనున్న కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర నోడల్ అధికారి పౌసుమిబసు మాట్లాడుతూ...,జిల్లాలో ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం లక్ష్యాలను నిర్దేశిత నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వెనుకబడిన సూచికలను గుర్తించి,వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లాలో నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని, ఒక మండలాన్ని మోడల్‌గా ఎంపిక చేసి,అక్కడ పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయం, ఆయిల్‌పామ్ సాగు తదితర పద్ధతులను సమగ్రంగా అమలు చేయాలన్నారు.మోడల్ మండలంలో సాధించిన ఫలితాలను ఇతర మండలాలకు విస్తరించడం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. చిన్న,సన్నకారు రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా అవసరమైన సహకారం అందించాలని,వాటిని బ్యాంకు రుణ సదుపాయాలతో అనుసంధానం చేయాలని సూచించారు.ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగు,సేంద్రియ వ్యవసాయం,పంటల వైవిధ్యీకరణపై మరింత దృష్టి సారించాలని తెలిపారు.జిల్లాలో యూరియా వినియోగం తగ్గడం అభినందనీయమని పేర్కొంటూ, ఇందుకు దోహదపడిన చర్యలు, అనుసరించిన పద్ధతులను కేస్ స్టడీ రూపంలో డాక్యుమెంటేషన్ చేసి సమర్పించాలని సూచించారు. పీఎండీడీకేవై పథకం అమలులో ఎదురయ్యే సమస్యలు, అవసరమైన సహకారం గురించి తమ దృష్టికి తీసుకువస్తే,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని కేంద్ర నోడల్ అధికారి తెలిపారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,పీఎండీడీకేవై లక్ష్యాల సాధనకు అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.వ్యవసాయంలో యూరియా వినియోగం తగ్గింపు,ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణతో పాటు




పశుసంవర్ధక,మత్స్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు.మహిళా సంఘాలు,రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సూక్ష్మ ఆహార పరిశ్రమలను ప్రోత్సహిస్తూ, వ్యవసాయ అభివృద్ధి మరియు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు.జిల్లాలో పీఎండీడీకేవై లో వెనుకబడిన సూచికల్లో పురోగతి సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి,నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ ముషాయిదా బేగం,జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప, ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్,పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్,ఎల్డిఎం శ్రీనివాసరావు,ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులు తమ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి

**ఉద్యమకారులకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**మాజీ జెడ్పిటిసి పి. వెంకట్ రాంరెడ్డి**



తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాటం చేసిన ఉద్యమకారులు తమ ఉద్యమానికి సంబంధించిన వివరాలను తెలంగాణ ఉద్యమకారుల కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఫరూఖ్‌నగర్ మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి. వెంకట్ రాంరెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో అరెస్టయిన వారు, జైలుకు వెళ్లిన వారు, వివిధ రకాల ఉద్యమాల్లో పాల్గొన్న వారు, ఉద్యమ సమయంలో గాయపడిన వారు తదితరులంతా తమ వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కూడా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వెంకట్ రాంరెడ్డి తెలిపారు. స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి షాద్‌నగర్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## అన్ని నీళ్లు నల్లగొండకే పోతే..
# పాలమూరు ఎట్లా బతకాలి?

**కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా 299 టీఎంసీలపై జేఏసీ ప్రశ్నలు**

**పాలమూరు--రంగారెడ్డి రైతులకు సాగునీటి కేటాయింపులు స్పష్టం చేయాలి**



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 15 (స్కై న్యూస్):** కృష్ణా జలాల్లో తెలంగాణకు కేటాయించిన 299 టీఎంసీల నీటిలో పాలమూరు--రంగారెడ్డి జిల్లాల రైతాంగానికి ఎంత వాటా దక్కుతుందో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ కన్వీనర్ టి.జి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సాగర్ ఎడమ కాలువ, దిండి, మూసీ, ఏఎంఆర్ లిఫ్ట్, ఎస్ఎల్‌బీసీ, మైనర్ ఇరిగేషన్ అవసరాలకు నీటి కేటాయింపుల నేపథ్యంలో పాలమూరు రైతులకు మిగిలే నీటి వాటా ఎంతని ప్రశ్నించారు. నల్లగొండ రైతులకు సాగునీరు అందించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, పాలమూరు రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాపాడాలని అన్నారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుపై పునఃసమీక్ష జరిపి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల రైతులకు న్యాయం చేయాలని కోరారు. నక్కలగండి లిఫ్ట్ ద్వారా గొట్టిముక్కల రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి శివన్నగుండెకు గ్రావిటీ ద్వారా నీటిని తరలించే ప్రత్యామ్నాయ ప్రతిపాదనను సాంకేతికంగా పరిశీలించాలని సూచించారు. రెండు ప్రాంతాల రైతులకు నష్టం కలగకుండా శాస్త్రీయమైన, న్యాయమైన నీటి పంపిణీ విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కోట మైసమ్మ అమ్మవారికి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 15 (స్కై న్యూస్):** రైతు కాలనీలోని కోట మైసమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని శ్రీ లలిత త్రిపుర సుందరి అవతారంలో అలంకరించారు. ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మి ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రైతు కాలనీ సంక్షేమ సంఘం, కోట మైసమ్మ సేవా సమితి ప్రతినిధులు దంపతులకు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా
# సుఖసంతోషాలతో ఉండాలి!

**రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించే జ్ఞానాన్ని ప్రభుత్వానికి ప్రసాదించాలి**

**ఏడుపాయల అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి**

**పాపన్నపేట/మెదక్, అక్టోబర్ 15,(స్కై న్యూస్ ప్రతినిధి ):** వనదుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించే జ్ఞానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కరీంనగర్ జెడ్పి మాజీ చైర్ పర్సన్ తుల. ఉమా,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మహిళ నేతలతో కలిసి ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గాభవానీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకుల్ షెడ్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించి కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సమర్పించిన 108 బోనాల కార్యక్రమంలోనూ పాల్గొని బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల మధ్య నిర్వహించిన బోనాల కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెను ఆలయ మర్యాదలతో సన్మానించారు.అనంతరం పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు



వెల్లివిరియాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ మంచి జరగాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయని అన్నారు.వ్యవసాయ రంగానికి విద్యుత్ ఎంతో కీలకమని, రైతులకు విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరైన సమయంలో విద్యుత్ అందక రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు.గతంలో కరోనా వంటి విపత్కర పరిస్థితులను



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమర్థంగా ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అదే విధంగా ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిస్థితులను కూడా రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడటంతోపాటు రైతుల సమస్యలను పరిష్కరించి వ్యవసాయ రంగానికి అండగా నిలవాలని పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం

**మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘన నివాళి**



**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 15 (స్కై న్యూస్):** మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. కలాం జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచుల
# పెళ్లికి అండగా ఉంటాం!

**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 15 (స్కై న్యూస్):** నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటూ ఆడపడుచుల వివాహాలకు ప్రభుత్వం సహకరిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద షాద్‌నగర్ పట్టణానికి చెందిన 17 మంది, ఫరూఖ్‌నగర్ మండలానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగయ్య, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు...

**వాసవి మాతకు లలితా దేవి అలంకరణ.**

**అలరించిన ఇలలో కలియుగ వైకుంఠం నృత్య రూపకం.**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 15( స్కై న్యూస్)** పట్టణ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న 56వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం వాసవి మాత మూలవిరాట్ ను లలితా దేవి రూపంలో అలంకరించారు భక్తులకు అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రాత:కాల పూజా కార్యక్రమాలతో పాటు విశేష పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు పూజా కార్యక్రమాలకు హాజరైన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ దంపతులను పట్టణ అధ్యక్షులు బిళ్ళకంటి హరిబాబు ఆలయ అధ్యక్షులు మిడిదొడ్డి అంజయ్య తో పాటు వివిధ సంఘాల నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు అనంతరం ఆలయ కమిటీ పట్టణ కమిటీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో దంపతులను ఘనంగా



సన్మానించారు అనంతరం గోపూజను నిర్వహించారు సామూహిక పూజా కార్యక్రమాలలో భాగంగా గణపతి సుబ్రహ్మణ్యం దుర్గ సరస్వతి లక్ష్మీ హోమం నిర్వహించడంతోపాటు లగు పూర్ణాహుతి లను వేదమంత్రోత్సవాలు మధ్య నిర్వహించి మహా నీరాజనం సమర్పించారు అనంతరం వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు సాయంకాల ప్రదోష పూజ



అనంతరం లలితా సహస్ర పారాయణం సామూహిక కుంకుమార్చన తులసి పుష్పార్చన తో పాటు హారతి పల్లకి సేవ డోలోత్సవం నిర్వహించారు అనంతరం ఆలయ ప్రాంగణంలో ఓం శ్రీ రక్ష కోలాట బృందం ఆధ్వర్యంలో కోలాటాలను మాస్టర్ బంగారు బాబు ఆధ్వర్యంలో ఇలలో కలియుగ వైకుంఠం నృత్యరూపకం ప్రదర్శించారు అనంతరం వారిని సన్మానించారు

## నవరాత్రి పర్వదినాల్లో ఎలికట్ట అంబా భవానీ మాత ఆలయంలో మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ప్రత్యేక పూజలు

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 15 (స్కై న్యూస్):** పవిత్రమైన శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలికట్ట అంబా భవానీ మాత ఆలయాన్ని మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి సందర్శించి, శ్రీ లలితా త్రిపురసుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న అంబా భవానీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ప్రార్థించారు. నవరాత్రి పర్వదినాల్లో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో పవిత్రమైన విషయమని, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత, మనోధైర్యం లభిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్ నవ



కిరణి నరసింహ ముదిరాజ్, శ్రీశైలం, శ్రీకాంత్, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

## గ్రామీణ అభివృద్ధి పనులకు
# ఎమ్మెల్యే శంకర్ శ్రీకారం



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 15 (స్కై న్యూస్):** షాద్‌నగర్ నియోజకవర్గంలోని అయ్యవారిపల్లి, వెంకట్ రెడ్డిపల్లి, పూసలగడ్డ తండాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అయ్యవారిపల్లిలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. వెంకట్ రెడ్డిపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించగా, పూసలగడ్డ తండాలో 24 గంటల విద్యుత్ సరఫరా, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్ప్రింక్లర్లతో నీటి సమర్థ వినియోగం సాధ్యం - ఉద్యాన శాఖ అధికారిణి నవీన

**మాడుగుల మండలం బ్రాహ్మణపల్లి, ఆసిరెడ్డిపల్లి, పల్లెతండాలో 22 మంది రైతులకు యూనిట్ల పంపిణీ**

**ఆధునిక సాంకేతికతతో సాగు చేయాలని రైతులకు సూచన**



**ఆమనగల్లు, అక్టోబర్15 (స్కై న్యూస్):**వ్యవసాయంలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు స్ప్రింక్లర్ల వాడకం ఎంతో ఉపయోగకరమని, దీని ద్వారా నీటి సమర్థ వినియోగం సాధ్యమవుతుందని ఇబ్రహీంపట్నం ఉద్యాన శాఖ అధికారిణి నవీన తెలిపారు. మాడుగుల మండలంలోని బ్రాహ్మణపల్లి, ఆసిరెడ్డిపల్లి, పల్లెతండా గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు ఆమె స్ప్రింక్లర్ యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి రైతు బాధ్యత అని అన్నారు. సాంప్రదాయ పద్ధతుల కంటే స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు నీరు అందించవచ్చని, నీటి వృథాను అరికట్టవచ్చని వివరించారు.రైతులు వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. స్ప్రింక్లర్ల వినియోగం, నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల రైతులు, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల వాగ్దానాల అమలు పై
# శ్వేత పత్రం విడుదల చేయాలి...

**కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే కరువు కష్టాలు.**

**భూముల ధరల పెంపుకే తూడికుర్తిలో పాఠశాల నిర్మాణం.**

**ఎమ్మెల్సీ ఎన్నికలలో బిఆర్ఎస్ కు అండగా నిలవాలి.**



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 15( స్కై న్యూస్)** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు విద్యార్థి యువజన నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాల అమలుపై శ్వేత పత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ యువ నేత డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి మూడు సంవత్సరాలు అవుతున్న ఎందుకు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని ఆయన నిలదీశారు. యువజన డిక్లరేషన్ లో అనేక హామీలను ప్రకటించి గద్దెనెక్కిన తర్వాత ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 75 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని మూడు సంవత్సరాల పాలనలో సుమారు 14 వేల ఉద్యోగాలు మాత్రమే నోటిఫికేషన్లు వేసి భర్తీ చేశారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసత్య ప్రకటనలు మానుకొని ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని ఇంటికో ఉద్యోగం ఎక్కడ పోయిందని అమరవీరుల కుటుంబానికి నెలకు 20వేల రూపాయలు చెల్లిస్తామని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామన్న హామీ ఎటు పోయిందని మండిపడ్డారు. రాష్ట్రాన్ని ఏడు జోన్లుగా విభజించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయడం లేదని నిరుద్యోగులను మోసం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరించిన నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరువు కష్టాలు ఏర్పడ్డాయని అన్నారు. యూనివర్సిటీలో స్థాయి పెంచుతామని ఇచ్చిన హామీ ఎటు పోయిందని గతంలో వైయస్సార్ హయాంలో ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ పథకం కూడా అమలు చేయడం లేదని ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలను ప్రభుత్వం మానుకోవాలని ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్కు గుణపాఠం చెబుతారని అన్నారు నిరుద్యోగ యువత ఎమ్మెల్సీ ఓటర్లు బిఆర్ఎస్కు అండగా నిలిచి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి గారడి మాటలు మానుకొని సంక్షేమంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు రైతుల సమస్యలు పరిష్కరించడం లేదని సాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వల్లే పంటలు ఎండిపోతున్నాయని విద్యుత్ కొరత వల్ల రైతుల కష్టాలు మొదలయ్యాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్ తమ నీటి హక్కును పూర్తిగా వినియోగించుకోవడంతో పాటు అధిక నీటితో 80% వ్యవసాయ పొలాలకు సాగునీరు అందిస్తుండగా మన రాష్ట్రంలో 26% మాత్రమే పంట పొలాలకు నీరు అందుతున్నాయి అన్నారు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాన్ని నిర్మించవలసి ఉండగా ఎమ్మెల్యే ఎమ్మెల్సీ సొంత భూముల ధరలను పెంచుకునేందుకు తూడుకుర్తి గ్రామంలో ఇండికేటర్ పాఠశాల నిర్మాణం చేపట్టారని ఆరోపించారు ఈ సమావేశంలో సీనియర్ నాయకులు అర్థం రవి బాలా గౌడ్ లక్ష్మయ్య కౌన్సిలర్ అర్జునయ్య నాయకులు భీముడు భీమయ్య సత్యం అహ్మద్ వెంకటస్వామి సుబ్బయ్య వెంకటేశ్వర్లు డిష్ రాజు దామోదర్ తోపాటు పలువురు పాల్గొన్నారు

# మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి ధ్యేయం

**శానిటేషన్ పటిష్టంగా అమలు కావాలి**

**తడి చెత్త - పొడి చెత్త వేరు చేసి ప్రజలు అందించే విధంగా చూడాలి**

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్, అక్టోబర్ 15,(స్కై న్యూస్ ప్రతినిధి ):** మున్సిపల్ కమిషనర్స్ ప్రజా జీవనంలో ప్రజలతో భాగస్వామ్యం కావాలి నగరాభివృద్ధి పనులలో వేగం పెంచాలి.పరిసర పరిశుభ్రతకు నిలయాలుగా మున్సిపాలిటీలు తయారు కావాలి మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా శానిటేషన్ పై పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతూ తడి చెత్త - పొడి చెత్త వేరు చేసి ప్రజలు అందించే విధంగా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్స్ ప్రజా జీవనంలో ప్రజలతో భాగస్వామ్యం కావాలి నగరాభివృద్ధి పనులలో వేగం పెంచాలి. పరిసర పరిశుభ్రతకు నిలయాలుగా మున్సిపాలిటీలు తయారు కావాలని అదనపు కలెక్టర్ నగేష్ మున్సిపల్ ఆదేశించారు.కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల మున్సిపల్ మున్సిపల్ కమిషనర్స్ మున్సిపల్ సిబ్బందితో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధిపై సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు ప్రగతి పథంలో నడవాలంటే కమిషనర్స్ ప్రణాళిక బద్ధంగా మున్సిపల్ సిబ్బంది సమగ్ర కార్య చరణతో ముందుకు నడుపుతూ శానిటేషన్ లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ మన మన పట్టణం, మన ఇల్లు మన పరిసరాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేసే విషయంలో లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు పోవాలన్నారు నగరాభివృద్ధి పథకంలో భాగంగా ూణఖీజ , అమృత్,ూదీవీ ..మున్సిపల్ పెండింగ్ పనులు వేగం పెంచాలని,100 శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.మెదక్ , నర్సాపూర్ రామాయంపేట తూప్రాన్ మున్సిపల్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేసి, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచాలని,చెత్తను 4 రకాలు గా వేరు చేయాలని ,త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని , వీది దీపాలు క్రమం తప్పకుండా వెలగాలని, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్, రామాయంపేట తూప్రాన్ నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్ బాధితులను పరామర్శించిన ఎంపీ రఘునందన్ రావు!



**నర్సాపూర్ /మెదక్, అక్టోబర్ 15,(స్కై న్యూస్ ప్రతినిధి ):** నర్సాపూర్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనలో యువకుడు మృతి చెందడంపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు.నర్సాపూర్‌లోని వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో ఫుడ్ పాయిజన్ ఘటన తీవ్ర కలకలం రేపింది. రెస్టారెంట్‌లో ఆహారం తీసుకున్న 32 మంది అస్వస్థతకు గురికాగా, వారిలో పిట్ల సాయిరాం అనే యువకుడు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 27 మంది బాధితులను మెదక్ ఎంపీ రఘునందన్ రావు పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.సాయిరాం కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి ఫుడ్ పాయిజన్ ఘటనలో మృతి చెందిన నర్సాపూర్‌కు చెందిన పిట్ల సాయిరాం కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. బాధితులకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని వైద్యులకు సూచించారు. హోటళ్లలో నిరంతరం తనిఖీలు చేపట్టాలి రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ నిబంధనలు కఠినంగా అమలయ్యేలా తెలంగాణ ఫుడ్ కమిషనర్ మహంతి ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఎంపీ కోరారు. మెదక్ జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ సైతం తన బాధ్యతలను గుర్తించి హోటళ్లలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు.ఫుడ్ సేఫ్టీకి సంబంధించిన అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఎంపీ విమర్శించారు. ఇకనైనా సంబంధిత అధికారులు అప్రమత్తమై, నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా బయట ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ, సాధ్యమైనంతవరకు ఇంటి భోజనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**ఆస్పత్రిలో వైద్యుల కొరత.. అదనపు అంబులెన్స్‌కు కృషి**

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరతతో పాటు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ అందుబాటులో ఉండాల్సిన అవసరాన్ని ఎంపీ ప్రస్తావించారు. ఈ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అదనపు అంబులెన్స్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు, ఫుడ్ పాయిజన్‌కు గురైన బాధితుల్లో ముగ్గురి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు సమాచారం. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.హోటళ్లలో ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# కోట మైసమ్మ అమ్మవారికి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 15 (స్కై న్యూస్):** రైతు కాలనీలోని కోట మైసమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని శ్రీ లలిత త్రిపుర సుందరి అవతారంలో అలంకరించారు. ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మి ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రైతు కాలనీ సంక్షేమ సంఘం, కోట మైసమ్మ సేవా సమితి ప్రతినిధులు దంపతులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## జయమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో
# నారాయణపేట ప్రాంతం సస్యశ్యామలం

**కుంభం శివకుమార్ రెడ్డి.**

**చిట్టెం.నర్సిరెడ్డి కి ఈ ప్రాజెక్టు అంకితం.**



**నారాయణపేట, అక్టోబర్ 15:( స్కై న్యూస్):** మక్తల్--నారాయణపేట--కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భాగంగా నారాయణపేట మండలం పెరపల్లి గ్రామంలోని జయమ్మ చెరువులో జయమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులకు గురువారం నారాయణపేట జిల్లా మాజీ డిసీసీ అధ్యక్షులు కుంభం. శివకుమార్ రెడ్డి, జిల్లా ఆడిషనల్ కలెక్టర్ శ్రీను, ఇరిగేషన్ శాఖ ఎస్. ఈ సత్యనారాయణ లు రైతులతో కలసి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం గ్రామ సర్పంచ్ ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభ లో రైతులను ఉద్దేశించి మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ, జయమ్మ రిజర్వాయర్ ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమని, ఎన్నో ఏళ్ల పోరాటం, రైతుల త్యాగాల ఫలితంగా ఈ రోజు నిర్మాణ పనులు ప్రారంభమవుతున్నాయని అన్నారు.

**నాలుగు దశాబ్దాల పోరాటానికి ఫలితం...**

జయమ్మ చెరువు ను రిజర్వాయర్ మార్చ్డానికి కోసం ఎన్నో కష్టాలు, అవమానాలు, ఆటంకాలను ఎదుర్కొంటూ పోరాటం సాగించామని కుంభం శివకుమార్ రెడ్డి తెలిపారు.ఆరోజు అధికారంలో ఉన్న కొందరు అవగాహన లేకుండా జయమ్మ చెరువు గురించి మాట్లాడారని,అభివృద్ధి చేయడం చేతకాక, రాజకీయాలు చేశారని ఆరోజే ఒక్క అవకాశం వస్తే ఈ ప్రాంతానికి సాగునీరు తీసుకొచ్చి ఎలా అభివృద్ధి చేయాలో చేసి చూపిస్తామని ఆరోజు చెప్పిన మాట ప్రకారం ఈరోజు ప్రాజెక్టు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామన్నారు.రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా పట్టించుకోకుండా ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.పేర్కొన్నారు. దివంగత నార్సిరెడ్డి ఆశయ సాధనకు ఈ ప్రాజెక్టును అంకితం చేస్తున్నానని భావోద్వేగంతో ప్రకటించారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు**

మక్తల్-నారాయణపేట-కొడంగల్ సాగునీటి ప్రాజెక్టు మంజూరు లో మరియు వేగవంతంగా నిర్మాణ పనులు ముందుకు సాగేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం అందించారని పేర్కొంటూ, ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు, నిర్వాసిత రైతులకు ఎకరాకు 20 లక్షల పరిహారం పెంపు వంటి అంశాలను ప్రస్తావించారు.ఈ ప్రాంత ప్రజల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఆటంకాలు ఎదురైనా వాటిని అధిగమించి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

**భూములు కోల్పోయిన రైతుల త్యాగాలను గౌరవిస్తాం...**

రిజర్వాయర్ కోసం భూములు అందించిన రైతుల త్యాగాలను మరువమని, వారిని గౌరవిస్తామని కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు.ప్రతి రైతుకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు. రైతుల భూముల్లో ఉన్న బావులు,బోర్లు, చెట్లు, షెడ్లు తదితర ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,అర్హత కలిగిన ప్రతి ఒక్కటి నమోదు చేయాలని అధికారులను కోరారు. పరిహారం విషయంలో ఏ రైతుకూ అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు.భూములు కోల్పోయిన కుటుంబాలు తమ జీవనాధారాన్ని కోల్పోయి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రైతులు తనపై,ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం.పర్ణిక రెడ్డి పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటమని ఈ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం విద్యా, వైద్య రంగాలకు వందల కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని,తమ చివరి శ్వాస వరకు ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం కట్టుబడి పని చేస్తామని హామీ ఇచ్చారు.

**రైతుల సహకారంతో ప్రాజెక్టు విజయవంతం కావాలి**

ప్రాజెక్టు నిర్మాణానికి భూములు అందించిన రైతులకు, గ్రామ సర్పంచ్ అంజనేయులుకు, ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కుంభం శివకుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జయమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయి, నారాయణపేట ప్రాంతం సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు,ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బోర్లు వేసినా నీళ్లు లేవు

**మోటర్లు మార్చినా ఫలితం లేదు!**
**నర్వ మండలంలో వర్షపాతం లోటు**
**అడుగంటిన భూగర్భ జలాలు**
**ఏడు ఎకరాల్లో వరి సాగు**
**ఐదు ఎకరాల పంట పూర్తిగా ఎండిపోయింది!**

**నర్వ అక్టోబర్15 (స్కై న్యూస్):**ఆరుగాలం కష్టపడి పంటలు పండించి కుటుంబాన్ని పోషించుకోవాలనే ఆశతో వ్యవసాయం చేసిన రైతన్నకు చివరకు కన్నీరే మిగిలింది. సకాలంలో వర్షాలు కురవకపోవడం,భూగర్భ జలాలు అడుగంటిపోవడం, బోర్లలో నీరు తగ్గిపోవడంతో పంటను కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి.నర్వ మండలంలో వర్షపాతం లోటు నమోదవడంతో పాటు సాగునీటి సమస్యలు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ఈ పరిస్థితులకు అద్దం పడుతోంది నర్వ మండలం







రాయికోడ్ గ్రామానికి చెందిన రైతు యం.శంకర్ సాగు చేసిన వరి పంట దుస్థితి.

**7 ఎకరాల్లో వరి సాగు...5 ఎకరాల్లో పూర్తిగా నష్టం!**

నర్వ మండలం రాయికోడ్ గ్రామ యువ రైతు యం.శంకర్ తనకున్న వ్యవసాయ భూమిలో 7 ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు.పంట చేతికొస్తే కుటుంబ అవసరాలు తీరడంతో పాటు పెట్టుబడికి తగిన ఆదాయం వస్తుందని ఆశపడ్డాడు.అయితే వర్షాలు సరిగా కురవకపోవడం, బోర్లలో నీటి మట్టం పడిపోవడంతో సాగునీటి సమస్య తీవ్రంగా మారింది.దీంతో 7 ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలో 5 ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది.ఎంతో శ్రమించి సాగు చేసిన పంట కళ్లముందే ఎండిపోవడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు.



**ఎన్ని ప్రయత్నాలు చేసినా దక్కని ఫలితం!**

పంటను ఎలాగైనా కాపాడుకోవాలనే ఆశతో రైతు ఎన్నో ప్రయత్నాలు చేశాడు.నీటి కోసం బోర్లు వేయించినా ఆశించిన ఫలితం దక్కలేదు.ఉన్న బోర్లకు కొత్త మోటర్లు తెచ్చి బిగించినా నీళ్లు సరిగా రావడం లేదు.బోర్లు నీళ్లు కొట్టకపోవడంతో పొలానికి సాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది.

**మరోవైపు విద్యుత్ సమస్యలు**

కరెంటు సమస్యను అధిగమిస్తే పంటను కాపాడుకోవచ్చని భావించి,డీడీలు కట్టి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు.అయినప్పటికీ భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లలో నీరు లేకపోయింది.విద్యుత్ సౌకర్యం కోసం ఖర్చు చేసినా,కొత్త మోటర్లు ఏర్పాటు చేసుకున్నా పంటకు అవసరమైన నీటిని అందించలేకపోయాడు.

**ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల పెట్టుబడి!**

వరి సాగు కోసం ఒక్కో ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతు తెలిపాడు.ఈ లెక్కన 7 ఎకరాలకు మొత్తం రూ.1.75 లక్షల నుంచి రూ.2.10 లక్షల వరకు పెట్టుబడి అయింది.ఇందులో 5 ఎకరాల పంట పూర్తిగా ఎండిపోవడంతో ఆ ఐదు ఎకరాలకు సంబంధించి సుమారు రూ.1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి ప్రమాదంలో పడింది.పంటను కాపాడుకునేందుకు చేసిన అదనపు ప్రయత్నాలు, బోర్లు,మోటర్లు,ట్రాన్స్‌ఫార్మర్ కోసం చేసిన ఖర్చులు రైతుకు మరింత భారంగా మారాయి.పెట్టుబడి పెట్టి పంటను సాగు చేసినా,చివరకు దిగుబడి చేతికి అందని పరిస్థితి ఏర్పడింది.పంట నష్టంతో పాటు అప్పులు ఎలా తీర్చాలనే ఆందోళన రైతును వెంటాడుతోంది.

**రైతన్నను ఆదుకునేదెవరు?**

వర్షపాతం లోటు,భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలు రైతుల సాగును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రకృతిపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు ఇలాంటి పరిస్థితుల్లో తీవ్రంగా నష్టపోతున్నారు.పంటను కాపాడుకోవడానికి రైతు తన శక్తికి మించి ప్రయత్నించినా, నీరు అందుబాటులో లేకపోవడంతో చివరకు నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది.

**పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందించాలి**

సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి,ఎండిపోయిన వరి పంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని రైతు కోరుతున్నాడు.అర్హతను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట నష్టపరిహారం అందించాలని,భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నీళ్ల కోసం బోర్లు వేసినామోటర్లు మార్చినా డీడీలు కట్టి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నా చివరకు పంటను కాపాడుకోలేకపోయాడు. ఏడు ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలో ఐదు ఎకరాలు ఎండిపోవడంతో రైతన్నకు మిగిలింది నష్టమే.రైతు కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# జీవితంలోని మధుర జ్ఞాపకాలను పదిలపరిచేది ఫొటోగ్రాఫర్లే

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, అక్టోబర్ 15(స్కైన్యూస్** జీవితంలోని అపురూప ఘట్టాలను, మధుర జ్ఞాపకాలను శాశ్వతంగా పదిలపరిచే ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లకు ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. లక్ష్మి నగర్ కాలనీ లో గల వారి కార్యాలయంలో స్థానిక ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ జీవితంలోని విలువైన క్షణాలను కెమెరాలో బంధించి, వాటిని చిరస్మరణీయంగా మార్చేది ఫొటోగ్రాఫర్లేనని కొనియాడారు. వ్యక్తిగత జీవితాల్లోనే కాకుండా సామాజిక కార్యక్రమాల్లోనూ ఫొటోగ్రాఫర్ల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. వారి వృత్తికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉన్నాయని తెలిపారు. ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారి సంక్షేమానికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం తరఫున తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ, ఫొటోగ్రాఫర్ల ఐక్యతకు, అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, నూతన కార్యవర్గ సభ్యులు, సీనియర్ ఫొటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, తిరుమల వెంకటేష్, మైత్రి యాదయ్య, మల్లేష్ యాదవ్, కృష్ణకాంత్ రెడ్డి , సతీష్ తో పాటు ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# యాదవ బంధువుల సంక్షేమం, అభ్యున్నతికి కృషి

**: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, అక్టోబర్ 15,(స్కైన్యూస్ )** నూతనంగా ఎన్నికైన గోకుల యాదవ సంఘం కార్యవర్గ సభ్యులను అధ్యక్షులు పార్వతి సుజిత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జోగు గంగన్న యాదవ్, కోశాధికారి పశువుల చంద్రశేఖర్‌లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి నూతనంగా ఎన్నికైన గోకుల యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువ నాయకత్వానికి బాధ్యతలు అప్పగించడం ద్వారా సంఘం మరింత అభివృద్ధి సాధిస్తుందని, సంఘంలోని ప్రతి ఒక్కరి సహకారంతో యాదవ బంధువులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. యాదవ సంఘం ఐక్యతను చాటుతూ, సమాజంలోని కుల బాంధవుల సంక్షేమం, అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేయాలని పేర్కొన్నారు. యాదవ సంఘం అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోకుల యాదవ సంఘం పెద్దలు డిసిసి ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, కార్పొరేటర్ రఘు యాదవ్, ముఖ్య నాయకులు, యాదవ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# చించోడ్‌లో రేషన్ కార్డుల పంపిణీ,.. బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 15 స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా చించోడ్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 2.75 కోట్లతో హెచ్ఎండీఏ నిధులతో మంజూరైన చించోడ్ నుంచి వెంకట్ రెడ్డి పల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వర్షాధారిత పంటల సాగు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని రైతులకు సూచించారు. పంటలు చేతికి వచ్చే కీలక సమయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అదనంగా మరో రెండు గంటల విద్యుత్ సరఫరా చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



# పాపిరెడ్డిగూడ వద్ద రోడ్డు ప్రమాదం

**రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులను గుర్తించి పరామర్శించిన రవీందర్ యాదవ్**

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 15 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పాపిరెడ్డి గూడ గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్నారు రెండు బైకులు ఢీకొని ముగ్గురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. షాద్ నగర్ నుంచి కేశంపేట వైపు వెళుతున్న వై. రవీందర్ యాదవ్ రోడ్డు ప్రమాద ఘటనను గమనించి వాహనాన్ని నిలిపారు. పడిపోయి పడి ఉన్న ఇద్దరు క్షతగాత్రులను గమనించి అంబులెన్స్ కు ఫోన్ చేశారు. క్షతగాత్రులు వివరాలు అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు భరోసాను కల్పిస్తూ ధైర్యం చెప్పారు. భయపడవద్దని వారం రోజుల్లో ఆరోగ్యం కుదుటపడుతుందని ధైర్యం చెప్పారు. క్షతగాత్రులు తలకొండపల్లి మండలం వారిగా గుర్తించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల పట్ల మానవత్వంతో స్పందించడం పట్ల రవీందర్ యాదవ్ పనితీరును స్థానికులు కొనియాడారు.



# కరాటేతో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

**మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్ అక్టోబర్ 15 ( స్కై న్యూస్ )**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల కరాటే పోటీలను మక్తల్ పట్టణంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



# కోదాడలో కరువు పరిస్థితులు.. రైతులను ఆదుకోండి!

**అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి**
**ఎండిపోతున్న పంటలకు పరిహారం ఇవ్వాలి.. రైతు కూలీలకు కరువు భత్యం అందించాలి**
**కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**కోదాడ, అక్టోబర్ 15 (స్కై న్యూస్):** కోదాడ నియోజకవర్గంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున సూర్యాపేట జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో ఆవేదన చెందుతున్నారని అన్నారు. పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు అప్పులు చేసి వాటర్ ట్యాంకర్లు, జనరేటర్ల ద్వారా నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.



**పంట నష్టంపై సమగ్ర సర్వే చేపట్టాలి**

వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలని బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. నష్టపోయిన రైతులను గుర్తించి తక్షణమే పరిహారం అందించాలని, అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కోదాడ నియోజకవర్గంలోని అన్ని మండలాలను వెంటనే కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి**

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేక రైతు కూలీలు ఉపాధి కోల్పోతున్నారని, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. కూలీలకు నెలకు రూ.1,000 చొప్పున ఏడాదికి రూ.12,000 అందిస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. రైతుబంధు, రైతు భరోసా, రుణమాఫీ వంటి హామీల అమలుపైనా ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పక్కనపెట్టి అనవసర ఖర్చులకు ప్రాధాన్యం ఇస్తోందని బొల్లం విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరువు పరిస్థితులపై తక్షణ చర్యలు చేపట్టి, పంట నష్టపరిహారం, కరువు భత్యం అందించాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని, కూలీలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రజల పక్షాన ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బిజినెస్

## ఐడీబీఐ బ్యాంకులో వాటాల విక్రయం..

# కేంద్రం షేర్ కెనడా కంపెనీ చేతికి!

ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యాంకులో 60.72 శాతం వాటాను రూ.52,878 కోట్లకు కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ అనుబంధ సంస్థ '10955230 కెనడా ఇంక్'కు విక్రయించేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం పూర్తయితే ఎయిరిండియా విక్రయం తర్వాత దేశంలోనే అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణగా నిలవనుంది. ఐడీబీఐ బ్యాంకులో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న 30.48 శాతం వాటా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)కి ఉన్న 30.24 శాతం వాటా కలిపి మొత్తం 60.72 శాతాన్ని ఫెయిర్‌ఫాక్స్ కొనుగోలు చేయనుంది. ఒక్కో షేరుకు రూ.81 చొప్పున ఈ బిడ్ దక్కించుకుంది. మొత్తం కొనుగోలు విలువ రూ.52,877.07 కోట్లుగా ప్రభుత్వం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఒప్పందం పూర్తయితే భారత ఆర్థిక రంగంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా నిలుస్తుందని కేంద్రం పేర్కొంది.




**యాజమాన్య నియంత్రణ ఫెయిర్‌ఫాక్స్ చేతికి**

ఐడీబీఐ బ్యాంకులో యాజమాన్య నియంత్రణను ప్రైవేటు సంస్థకు బదిలీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రణాళిక ఈ నిర్ణయంతో ముందుకు సాగనుంది. అయితే, ఈ లావాదేవీ పూర్తవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి కీలకం కానుంది. బ్యాంకును సొంతం చేసుకుని నిర్వహించేందుకు ఫెయిర్‌ఫాక్స్ అర్హతలను ఆర్‌బీఐ పరిశీలించనుంది. ఇందులో భాగంగా సంస్థపై 'ఫిట్ అండ్ ప్రాపర్' అంచనా వేయనుంది. ఫెయిర్‌ఫాక్స్‌కు ఇప్పటికే సీఎస్‌బీ బ్యాంకులో వాటా ఉంది. నిబంధనల ప్రకారం ఐడీబీఐ బ్యాంకు కొనుగోలు పూర్తయిన రెండేళ్లలోగా సీఎస్‌బీ బ్యాంకును ఐడీబీఐలో విలీనం చేయాలి లేదా సీఎస్‌బీ బ్యాంకులో తన వాటాను విక్రయించి బయటకు రావాలి. అలాగే ఐడీబీఐ బ్యాంకులోని మైనారిటీ వాటాదారుల కోసం ఫెయిర్‌ఫాక్స్ ఓపెన్ ఆఫర్ కూడా ప్రకటించాల్సి ఉంటుంది.

**కేంద్రం, ఎల్ఐసీ వాటాలూ కొనసాగింపు**

ఈ ఒప్పందం తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ ఐడీబీఐ బ్యాంకులో కొంత వాటాను కొనసాగించనున్నాయి. రాబోయే రెండేళ్లలో ఎల్ఐసీ వాటా 19 శాతం నుంచి 15 శాతానికి తగ్గే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ మిగిలిన వాటాను బహిరంగ మార్కెట్ ద్వారా విక్రయించనున్నారు. ఈ లావాదేవీని వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణగా కాకుండా 'వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణ'గా పరిగణించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. బ్యాంకులో కేంద్రం, ఎల్ఐసీ వాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ ఒప్పందాన్ని పూర్తి చేయనున్నట్లు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపం) కార్యదర్శి అరుణీష్ చావ్లా పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు.

## మార్కెట్లోకి టయోటా నయా గ్లాంజా
## ప్రారంభ ధర రూ.6.99 లక్షలు




**న్యూఢిల్లీ :** ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్.. దేశీయ మార్కెట్లోకి అత్యంత ప్రజాదరణ పొందిన హచ్‌బ్యాక్ గ్లాంజా ఫేస్‌లిఫ్ట్‌ను విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.6.99 లక్షలుగా నిర్ణయించింది. ఇప్పటికే బుకింగ్‌లు ఆరంభించిన్నట్టు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. ఈ మాడల్‌లో వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, లెవల్ 2 అడాస్ ఫీచర్లు, 9 అంగుళాల టచ్‌స్క్రీన్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీల కెమెరా, హిల్‌హోల్డ్ కంట్రోల్ వంటి నూతన ఫీచర్లతో తీర్చిదిద్దింది.

## గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ కు తరలిరండి
'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్-2026'లో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్ :** 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌కు అనుగుణంగా డిసెంబర్ 7-9 మధ్య 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి.. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్-2026'లో ఆయన చెప్పారు.

## టీవీఎస్‌లో ఆస్తుల పంచాయతీ..
## రచ్చకెక్కిన వేణు శ్రీనివాసన్ కుటుంబ విభేదాలు

**న్యూఢిల్లీ :** యాజమాన్య హక్కులు, వ్యాపార ఆస్తుల విభజన లెక్కలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయని శ్రీనివాసన్ భార్య మల్లికా శ్రీనివాసన్, కూతురు లక్ష్మీ వేణు చెప్తున్నారు. ఈ మేరకు తాజాగా విడుదలైన ఓ సంయుక్త ప్రకటనలో ఆ ఇరువురు స్పష్టం చేశారు. కుటుంబ విభేదాల పరిష్కారానికి ఎలాంటి ఫైనాన్షియల్ సెటిల్మెంట్ జరుగలేదని పేర్కొన్నారు. 'ఈ వివాదం టీవీఎస్ గ్రూపునకు చెందిన ఆయా కంపెనీల్లో హోదాలకు సంబంధించి కాదు. యాజమాన్య హక్కులు, న్యాయబద్ధమైన వారసత్వ గుర్తింపునకు సంబంధించినది' అన్నారు. అలాగే పారదర్శకంగా ఈ ప్రక్రియ జరుగడం లేదని ఆరోపించారు. టీవీఎస్ మోటర్ కంపెనీ, దాని హోల్డింగ్స్ సంస్థలో వారసత్వం అంశాలపై కుటుంబంలో అభిప్రాయ భేదాలున్నాయన్న వార్తల నడుమ మల్లిక, లక్ష్మీ ప్రకటన మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు. టీవీఎస్‌లో ఆస్తుల గొడవ.. వేణు శ్రీనివాసన్, ఆయన భార్య మల్లికా శ్రీనివాసన్, కూతురు లక్ష్మీ వేణు, కుమారుడు సుదర్శన్ వేణుల మధ్యే జరుగుతున్నది. ఈ వ్యవహారంలో తండ్రీకొడుకులు ఒక గ్రూపైతే.. తల్లీకూతుళ్లు మరొక గ్రూప్. ఇక అసలు ఈ లొల్లికి కేంద్ర బిందువులు.. 2020 డిసెంబర్‌లో జరిగిన కుటుంబ ఒప్పందం, 2024 మార్చిలో చేసుకున్న అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ). అవును.. ఈ అగ్రిమెంట్లు కేవలం వ్యాపార నిర్వహణ కోసమేనని లక్ష్మీ వేణు అంటుండగా, కాదు.. ఆస్తుల యాజమాన్య బదిలీకి సంబంధినవి అని సుదర్శన్ వేణు అంటున్నారు. దీంతో ఇప్పుడు లక్ష్మీ వేణు కోర్టులకెక్కే ఆలోచనల్నీ చేస్తుండటం గమనార్హం. అయితే కంపెనీ చట్టాలు కూడా ఈ వ్యవహారంలో కీలకం కానున్నాయి. ఇక ఇప్పటికే సీనియర్ న్యాయవాదుల సమక్షంలో ఇరువర్గాలు భేటీ కూడా అయ్యాయి. వేణు శ్రీనివాసన్ వర్గం.. సదరు ఒప్పందాలు టీవీఎస్ హోల్డింగ్స్, టీవీఎస్ మోటర్ కంపెనీ యాజమాన్య హక్కులు సుదర్శన్‌కు వర్తిస్తాయని స్పష్టం చేస్తున్నట్టు చెప్తున్నది. అలాగే లక్ష్మీ వేణుకు సుందరం క్లేటన్, గ్రూప్‌నకు చెందిన చిన్న వ్యాపారాలు చెందుతాయని అంటున్నారు. అయితే లక్ష్మి ఈ వాదనను ఖండిస్తున్నారు. ఆ ఒప్పందాలు వ్యాపారపరమైన పాలనా విధుల కోసమేనని చెప్తున్నారు. యాజమాన్య హక్కుల బదిలీకి సంబంధించి నియమావళిని సూచించలేదని అంటున్నారు. కాగా, 2020 డిసెంబర్‌లో జరిగిన తొలి ఒప్పందంలో టీవీఎస్ వ్యవస్థాపకుడైన టీవీ సుందరం అయ్యంగార్ వారసులు రాజం, కృష్ణా, సంతానం, శ్రీనివాసన్, దొరైస్వామి శాఖల మధ్య నోటి మాట మీద కుదిరిన అవగాహనే. ఇది కుటుంబ శాఖల మధ్య నియంత్రణను పునర్వ్యవస్థీకరించడం, సంబంధిత వ్యాపార యాజమాన్యాల నిర్వహణను సమన్వయపర్చడం కోసమేనని చెప్తున్నారు. అయితే 2024 మార్చిలో కుదిరిన ఎంవోయూపై వేణు, మల్లిక, లక్ష్మి, సుదర్శన్ అంతా సంతకాలు చేశారు. ఇందులో టీవీఎస్ బ్రాండ్ వినియోగం, ఇతరత్రా అంశాలున్నాయి. అయినప్పటికీ టీవీఎస్ హోల్డింగ్స్ ఇందులో భాగం కాలేదు. కానీ 2025 ఏప్రిల్‌లో వేణు శ్రీనివాసన్.. టీవీఎస్ హోల్డింగ్స్‌లో ఉన్న 6.79 శాతం వాటాను వీఎస్ ట్రస్ట్‌కు బదిలీ చేసినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల వివరాలు చెప్తున్నాయి. అలాగే వీఎస్ ట్రస్ట్, శ్రీనివాసన్ ట్రస్ట్ రెండింటి ద్వారా టీవీఎస్ హోల్డింగ్స్‌లో బెనిఫిషియల్ ఓనర్‌గా సుదర్శన్ వేణును తదనంతర ఫైలింగ్‌లు ప్రకటించాయి.

## భారత్ తడబాటు..

# చేతులెత్తేసిన టీమిండియా

**19.3 ఓవర్లలో 233 పరుగులు చేసిన టీమిండియా**
**ఆరంభంలో దూకుడు.. మధ్యలో కీలక వికెట్ల పతనం**
**ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్ వెన్ను విరిచిన కీమో పాల్**
**నిరాశపర్చిన ఇషాన్, అయ్యర్, నమన్**
**బౌలింగ్‌లోనూ తేలిపోయిన భారత్**

భారీ లక్ష్యం.. ఆరంభంలో దూకుడు.. మధ్యలో కీలక వికెట్ల పతనం.. చివర్లో కీమో పాల్ విజృంభణ! ఇలా ఎన్నో మలుపుల మధ్య సాగిన నాలుగో టీ20లో భారత్‌కు ఓటమి తప్పలేదు. తొలుత షాయ్ హోప్ శతకంతో విరుచుకుపడటంతో వెస్టిండీస్ 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు పోరాడినా, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో విజయం అందలేదు. కీమో పాల్ నాలుగు ఓవర్లలో 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ వెన్ను విరిచాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు రెండేసి విజయాలు సాధించాయి. బెంగళూరులో శనివారం జరగనున్న ఐదో మ్యాచ్ సిరీస్ డిసైడర్ కానుంది. 248 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభం ఇచ్చాడు. అతడు కేవలం 23 బంతుల్లో 56 పరుగులు చేశాడు. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వేగంగా పరుగులు సాధిస్తూ భారత్ విజయంపై ఆశలు రేపాడు. అయితే కీమో పాల్ వేసిన ఓవర్‌లో శాంసన్ క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్‌కు తొలి ఎదురుదెబ్బ తగిలింది. ఇదే ఓవర్‌లో ఇషాన్ కిషన్ కూడా ఔటయ్యాడు. మూడు బంతులు ఎదుర్కొన్న అతడు ఆరు పరుగులే చేసి కీమో పాల్ బౌలింగ్‌లో జువెల్ ఆంద్రూకు క్యాచ్ ఇచ్చాడు. దూకుడుగా ఆడాల్సిన సమయంలో ఇషాన్ త్వరగా వెనుదిరగడం భారత్‌పై ఒత్తిడి పెంచింది. అభిషేక్ శర్మ 24 బంతుల్లో 29 పరుగులు చేశాడు. మూడు ఫోర్లు, ఒక సిక్సర్ బాదిన అతడిని గుడాకేశ్ మోటీ పెవిలియన్‌కు పంపాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 11 బంతుల్లో 16 పరుగులు చేసి శమర్ స్ప్రింగర్ బౌలింగ్‌లో జువెల్ ఆంద్రూకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది.

**తెలుగు కుర్రాళ్ల పోరాటం**

మధ్య ఓవర్లలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి భారత ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. తిలక్ దూకుడుగా ఆడుతూ సిక్సర్లతో స్కోరు వేగాన్ని పెంచాడు. అతడు 25 బంతుల్లో 45 పరుగులు చేశాడు. కానీ, షెఫర్డ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో పావెల్‌కు క్యాచ్ రూపంలో దొరికిపోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి కూడా కీలక సమయంలో వేగంగా పరుగులు సాధించాడు. అతడు 20 బంతుల్లో 41 పరుగులు చేసి తిలక్ వర్మ తరహాలోనే భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసి పావెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే చివరి ఓవర్లలో పరుగుల వేగం పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో భారత బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. భారీ షాట్లు ఆడే ప్రయత్నంలో వికెట్లు కోల్పోవడంతో విజయావకాశాలు దెబ్బతిన్నాయి.



**కీమో పాల్ ఐదు వికెట్ల విజృంభణ**

చివరి ఓవర్లలో కీమో పాల్ భారత బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వరుసగా వికెట్లు తీస్తూ ఛేదనను విండీస్ వైపు తిప్పాడు. నాలుగు ఓవర్లు వేసి 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. లక్ష్యం అందుకోవడం కష్టంగా మారడంతో భారత బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో క్యాచ్‌ల రూపంలో వికెట్లు సమర్పించుకున్నారు. చివరకు అర్ష్‌దీప్ సింగ్ రిటైర్డ్ హర్ట్ కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముందుగానే ముగిసింది. భారత్ 19.3 ఓవర్లలో 223 పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత బ్యాటర్లు చివరి వరకు పోరాడినా, కీమో పాల్ బౌలింగ్ ముందు నిలవలేకపోయారు.

**హోప్ శతకం.. విండీస్‌కు భారీ స్కోరు**

అంతకుముందు టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే వెస్టిండీస్ బ్యాటర్లు భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. కెప్టెన్ షాయ్ హోప్ 50 బంతుల్లో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లు ఉన్నాయి. ఆరంభం నుంచి చివరి వరకు దూకుడుగా ఆడుతూ భారత బౌలర్లకు కష్టాలు తెచ్చిపెట్టాడు. జువెల్ ఆంద్రూ 16 బంతుల్లో 21 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. అతడిని అక్షర్ పటేల్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన షిమ్రోన్ హెట్‌మైర్ కేవలం 12 బంతుల్లో 33 పరుగులు చేశాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడిని ప్రిన్స్ యాదవ్ క్యాచ్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేశాడు. రోవ్‌మన్ పావెల్ 17 బంతుల్లో 24 పరుగులు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సంజూ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 26 బంతుల్లో 49 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హోప్‌తో కలిసి చివరి ఓవర్లలో వేగంగా పరుగులు సాధించాడు. దీంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 247 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. మయాంక్ యాదవ్ నాలుగు ఓవర్లలో 52 పరుగులు ఇవ్వగా, అర్ష్‌దీప్ కూడా 52 పరుగులు సమర్పించుకున్నాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో విండీస్ బౌలర్లు విజయవంతమయ్యారు.

**భారత ఓటమికి కీలక కారణాలు**

శాంసన్ దూకుడు, తిలక్ వర్మ-నితీశ్ రెడ్డి పోరాటం ఉన్నప్పటికీ భారత్ లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. ఇషాన్ కిషన్ త్వరగా ఔటవడం, శ్రేయస్ అయ్యర్ కీలక సమయంలో పెవిలియన్‌కు చేరడం, మధ్య ఓవర్లలో వికెట్లు పడటం భారత ఛేదనను దెబ్బతీశాయి. మరోవైపు హోప్ శతకం, రూథర్‌ఫర్డ్ వేగవంతమైన ఇన్నింగ్స్ వెస్టిండీస్‌కు భారీ స్కోరు అందించాయి. చివర్లో కీమో పాల్ ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్‌ను దెబ్బతీయడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు.

# స్పోర్ట్స్

## బెంగాల్, గుజరాత్ గెలుపు



**కోల్‌కతా :** రంజీ ట్రోఫీని బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్ విజయంతో ప్రారంభించాయి. ఎలైట్ గ్రూప్ 'సీ'లో భాగంగా కోల్‌కతాలో ఢిల్లీతో జరిగిన పోరులో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన బెంగాల్.. ప్రత్యర్థిని 9 వికెట్ల తేడాతో చిత్తుచేసింది. ఎలైట్ గ్రూప్ 'సీ'లోని మరో మ్యాచ్‌లో మహారాష్ట్ర.. సర్వీసెస్‌ను 127 పరుగులతో ఓడించింది. ఇదే గ్రూపులో ఉన్న గుజరాత్ సైతం.. ఒడిశాపై 10 వికెట్ల తేడాతో గెలిచి టోర్నీలో బోణీ కొట్టింది. కాగా డిఫెండింగ్ చాంపియన్ జమ్ముకాశ్మీర్ మాత్రం తొలి మ్యాచ్‌లో డ్రాతో గట్టెక్కింది. శ్రీనగర్ వేదికగా మధ్యప్రదేశ్‌తో జరిగిన పోరులో ఆ జట్టు నిర్దేశించిన 325 రన్స్ ఛేదనలో జమ్ముకాశ్మీర్ ఆఖరి రోజు 88/7తో ఆటను ముగించింది. ఆంధ్రాతో జరిగిన మ్యాచ్‌ను కర్నాటక డ్రా చేసుకుంది. తమిళనాడు, పంజాబ్, సౌరాష్ట్ర, కేరళ తమ మ్యాచ్‌లను డ్రా చేసుకున్నాయి.

## కెరీర్ బెస్ట్ ర్యాంకుకు శ్రేయస్



**దుబాయ్ :** టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అతడు మూడు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి పోరులో భారీ శతకంతో చెలరేగడంతో అతడి ర్యాంకు మెరుగైంది. దీంతో టాప్-4లో ఉన్న బ్యాటర్లలో ముగ్గురూ భారత ఆటగాళ్లే కావడం విశేషం. ఇషాన్ అగ్రస్థానాన కొనసాగుతుండగా అభిషేక్ సెకండ్ ప్లేస్‌లో ఉన్నాడు. పాకిస్థాన్ సారథి సాహిబ్‌జాదా ఫర్హాన్ మూడో స్థానం దక్కించుకోగా అయ్యర్ ఫోర్త్ ప్లేస్‌లో ఉన్నాడు.



## దశావతారాల కథ 'హైందవ'

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టికల్ డివోషనల్ థ్రిల్లర్ 'హైందవ' నవంబర్ 27న విడుదలకానుంది. మహేష్ చందు నిర్మాత. సంయుక్త మీనన్ కథానాయిక. బుధవారం టీజర్‌ను ఆవిష్కరించారు. రంగాపురం అనే గ్రామంలోని పురాతన ఆలయంలో విగ్రహాలన్నీ మాయం అవుతాయి. అదే సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి హత్యకు గురవుతాడు. ఈ కేసుని పరిశోధించడానికి దేవుడిపై నమ్మకం లేని ఓ పోలీస్ అధికారిని నియమిస్తారు. ఈ నేపథ్యంలో చోటుచేసుకునే ఆసక్తికరమైన సంఘటనలతో టీజర్ ఆద్యంతం ఆసక్తిని పెంచింది. అద్భుతమైన కథ, విజువల్స్‌తో కూడిన మిస్టికల్ థ్రిల్లర్ ఇదని, ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ని అందిస్తుందని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు. దశావతార గుడి నేపథ్యంలో జరిగే కథ ఇదని దర్శకుడు పేర్కొన్నారు.



## కథలు నచ్చక.. కాస్త విరామం!

తొమ్మిది నెలలుగా తాను ఒక్క చిత్రాన్ని కూడా అంగీకరించలేదని అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్ స్పష్టం చేసింది. అల్లు అర్జున్ 'రాకా' చిత్రంలో ఈ భామ కీలక పాత్రను పోషిస్తుందనే వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'గత తొమ్మిది నెలలుగా ఏ సినిమాకూ సంతకం చేయలేదు. ఆఫర్లు బాగానే వస్తున్నాయి. కానీ కథలు నా మనసుకు నచ్చడం లేదు. అందుకే సినిమాలకు విరామం తీసుకున్నా. ఒక సినిమా కోసం మూడునాలుగు నెలల సమయాన్ని వెచ్చించాల్సి వస్తున్నది. అంత సమయాన్ని కేటాయిస్తున్నామంటే కథలో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి కదా' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. 'రాకా' సినిమాలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నదని, ఆమె షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నదని ముంబై సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకూ చిత్రబృందం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.



## 'కల్కి 2' సెట్స్‌లోకి రెబల్ స్టార్ ప్రభాస్.. త్వరలో ప్రారంభం కానున్న భారీ షెడ్యూల్!

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ సీక్వెల్ చిత్రం 'కల్కి 2898 ఏడీ -- పార్ట్ 2' షూటింగ్‌కు సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ పౌరాణిక చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం ఘనవిజయం సాధించడంతో, దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సీక్వెల్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన తదుపరి షెడ్యూల్ మరియు షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే ప్రభాస్ రేపటినుంచి ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ తన కీలక సన్నివేశాల షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను 2027 నాటికి పూర్తి చేసి, భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ కొత్త షెడ్యూల్ అప్‌డేట్‌తో ఆయన అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# సౌదీలో దాడులు వెంటనే ఆపాలి



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియాలో పౌర మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడులను భారతదేశం ఖండించింది. ఈ దాడులు తక్షణమే నిలిపివేయాలని, ఎంత మాత్రం పౌర మౌలిక సదుపాయాలపై దాడులు ఆమోదయోగ్యం కాదని ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. సౌదీలోని భారత పౌరుల కోసం అక్కడి భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. పౌరులు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ఇదే సమయంలో విదేశాల్లోని భారత పౌరుల సంక్షేమం, భద్రత తమ ప్రథమ ప్రాధాన్యం అని ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో జైస్వాల్- పలు కీలక అంశాలపై భారత వైఖరిని వెల్లడించారు.

సౌదీ అరేబియాలో జరుగుతున్న దాడుల పట్ల విచారం వ్యక్తం చేసిన భారత్- సౌదీ ప్రజలు, ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతోందని జైస్వాల్ పేర్కొన్నారు. ఆ దేశ సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుకునే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో త్వరలోనే శాంతి చర్చలు జరిగి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై అక్టోబర్ 10న జరిగిన దాడిలో మొత్తం ఒక భారతీయుడు సహా మొత్తం 13 మంది మరణించగా, మరో 10 మంది భారతీయులు గాయపడ్డారు. మృతుడి కుటుంబ సభ్యుల మేరకు సౌదీలోనే అంత్యక్రియలు నిర్వహించారు. యెమెన్‌లోని ఇరాన్ మద్దతు ఉన్న హూతీ తిరుగుబాటుదారులు కొద్ది రోజులుగా సౌదీపై వరుస దాడులకు పాల్పడుతున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. గాయపడిన భారతీయుల్లో పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

**భారతీయులకు ఎంబసీ కీలక మార్గదర్శకాలు**

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దాడులు జరుగుతున్నందున అక్కడి భారతీయులకు, భారత రాయబార కార్యాలయం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. భారతీయులు అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, స్థానిక అధికారుల సూచనల్ని కచ్చితంగా పాటించాలని పేర్కొంది. జరుగుతున్న పరిణామాలకు సంబంధించి వీడియోలు, వార్తల్ని ధ్రువీకరించకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. భారతీయులకు సహాయం చేసేందుకు ఎంబసీ 24 గంటల కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో o966- 536216082 (వాట్సాప్) నంబర్‌కు సందేశాలు పంపొచ్చు. ఇంకా 8002471234 నంబరు ద్వారా అధికారుల్ని సంప్రదించొచ్చు. మరోవైపు గల్ఫ్, హర్మూజ్ జలసంధి ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఈ క్రమంలో భారత జాతీయ భద్రతా సలహాదారు (చీూూ) అజిత్ డోభాల్ అక్టోబర్ 12న ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహ్‌సేన్ రెజాయితో ఫోన్‌లో మాట్లాడినట్లు రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. సముద్ర మార్గాల్లో భారత నావికులు, చమురు ట్యాంకర్ల భద్రతపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు. ఇటీవల వారం వ్యవధిలోనే భారతీయ సిబ్బంది ఉన్న 3 వాణిజ్య నౌకలపై వరుస దాడి ఘటనలు సముద్ర భద్రతపై ఆందోళనలు పెంచాయి.

**దిల్లీలో దీ×మీూజుజ హోం మంత్రుల భేటీ- బంగ్లాదేశ్ హాజరు**

ఇక కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన న్యూదిల్లీలో తొలి బిమ్‌స్టెక్ (దీ×మీూజుజ) హోం మంత్రుల భేటీ జరిగినట్లు జైస్వాల్ తెలిపారు. ఇందులో బంగ్లాదేశ్‌తో సహా అన్ని సభ్యదేశాలు పాల్గొన్నాయని వెల్లడించారు. ఇందులో ఉగ్రవాద నిర్మూలన, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై చర్యలు, మనీలాండరింగ్ నియంత్రణలో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని పునరుద్ఘాటిస్తూ 'దిల్లీ డిక్లరేషన్'ను ఆమోదించారని ఎంఈఏ అధికార ప్రతినిధి వివరించారు. కొంతకాలంగా భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, దిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో బంగ్లాదేశ్ పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. దిల్లీ నిరసనలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం (=ుఊజుఎ=) చేసిన వ్యాఖ్యలను కూడా భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని, ఆ వ్యాఖ్యలు అనుచితమని తోసిపుచ్చింది. ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న అణచివేతలపై స్పందించని ఓహెచ్‌సీహెచ్ఆర్ వైఖరి ఏకపక్షంగా ఉందని భారత్ వైఖరిని వెల్లడించారు జైస్వాల్.

## ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..



తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రావో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

**ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

## చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే

# వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి



భారత్- చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే 'వాస్తవాధీన రేఖ' వెంబడి పరిస్థితి స్థిరంగా ఉండాలని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. దిల్లీలో జరిగిన 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్'లో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

"చైనాకు మేము చెప్పే విషయం ఒకటే 'మీరు ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలను కోరుకున్నా, మిగిలిన సంబంధాలు ముందుకు సాగాలన్నా సరిహద్దు స్థిరంగా ఉండాలి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి అనేది చాలా స్పష్టమైన, సహజమైన విషయం'" అని ఆయన అన్నారు. 2024 నుంచి =ూజ వెంబడి పరిస్థితి చాలా వరకు అదుపులోకి వచ్చిందని, ఫలితంగా సంబంధాలు సాధారణ స్థితి వైపు పయనిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లో నాలుగన్నర ఏళ్లకు పైగా కొనసాగిన సైనిక ప్రతిష్టంభన కారణంగా దెబ్బతిన్న సంబంధాలను సరిదిద్దడానికి గత కొన్ని నెలలుగా ఇరుపక్షాలు చర్యలు చేపట్టాయి. చివరకు ఇరు దేశాల మధ్య పలు దఫాల చర్చల అనంతరం ప్రతిష్టంభన 2024 చివరలో ముగిసింది. ఈ క్రమంలోనే సరిహద్దు సమస్యపై ఏదైనా 'ప్రారంభ దశ ఒప్పందం' కుదిరితే దేశంలో మరిన్ని చైనా పెట్టుబడులను భారత్ అనుమతిస్తుందా అన్న ప్రశ్నకు సమాధానంగా, వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నామని జైశంకర్ స్థూలంగా చెప్పారు. "మేము ఇప్పుడు ఆ అవకాశాలను పరిశీలిస్తున్నాం. భవిష్యత్తులో పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. అయితే, వ్యాపారం చేయడానికి ముందు సరిహద్దు సమస్యను తప్పనిసరిగా పరిష్కరించుకోవాలని మేము పట్టుబట్టడం లేదు. మేము పెద్ద నిబంధనలు లేదా కఠినమైన షరతులు పెట్టడం లేదు. మా అంచనాలు చాలా తక్కువగా ఉన్నాయి. కేవలం శాంతి, ప్రశాంతతను పాటించడం మాత్రమే కావాలి. సరిహద్దు సమస్య పరిష్కారం తప్ప మరేదానితోనూ ఈ 'ప్రారంభ దశ ఒప్పందాన్ని' నేను ముడిపెట్టను. వ్యాపారం లేదా మార్కెట్ యాక్సెస్ అంశాలకు సంబంధించి మేము అనుసరించే విధానాలు వేరుగా పరిగణిస్తాం."

చైనాతో ఉన్న ఆర్థికపరమైన అంశాలపై కూడా విదేశాంగ మంత్రి జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. "చైనాతో మాకు చాలా కీలకమైన ఆర్థిక సమస్యలు కూడా ఉన్నాయి. నేడు వాణిజ్య సమతుల్యతను పరిశీలిస్తే, అది పూర్తిగా చైనా వైపే మొగ్గు చూపి ఉంటోంది. ఈ అసమతుల్యత తీవ్రంగా ఒకే వైపునకే ఉంది. ప్రపంచంలోని ఇతర దేశాలతో అనేక రంగాల్లో మేము విజయవంతంగా వాణిజ్యం సాగిస్తున్నా, చైనాలో మాత్రం మాకు మార్కెట్ ప్రవేశం లభించలేదు. అక్కడ ఆయా రంగాల్లో మా వ్యాపార కార్యకలాపాలు విజయవంతం కాలేదు. మేము వారికి సమానమైన వాణిజ్య అవకాశాలను కల్పించినట్లుగా, చైనాలో మాకు అటువంటి సమాన అవకాశాలు లభించడం లేదని మేము భావిస్తున్నాం." అని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల గురించి కూడా జైశంకర్ ప్రస్తావించారు. అవి ఇరు దేశాల సంబంధాలపై ఎంత తీవ్రమైన ఒత్తిడిని కలిగించాయో గుర్తు చేశారు. "1975 నుంచి 2020 వరకు అంటే దాదాపు 45 ఏళ్ల పాటు సరిహద్దులో ఎటువంటి రక్తపాతం జరగలేదు. చివరిసారిగా 1975లో ప్రాణనష్టం జరిగింది. ఆ తర్వాత కాలంలో భారత్- చైనా సంబంధాలు మెరుగుపడ్డాయి. అనంతరం 2020లో మేము కొవిడ్ లాక్‌డౌన్ పరిస్థితుల్లో ఉన్నప్పుడు సరిహద్దులో వరుస సమస్యలు తలెత్తాయి. చివరకు అవి ఘర్షణకు దారితీసి ఇరువైపులా పలువురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మా దృష్టిలో ఇది 1975 నుంచి కొనసాగుతున్న పరిస్థితులకు పూర్తిగా భిన్నమైన పరిణామం. సరిహద్దు ప్రాంతాల్లో శాంతికి భంగం కలిగితే అది సంబంధాలపై ప్రభావం చూపుతుంది," అని జైశంకర్? అన్నారు. శాంతిని పునరుద్ధరించే వరకు తర్వాతి కొన్నేళ్లలో ఆ పరిణామాలు స్పష్టంగా కనిపించాయని జైశంకర్ పేర్కొన్నారు.

## దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది



భారతదేశ సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలు దేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాలతో అనుసంధానిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వీటి వల్ల దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని కొనియాడారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించడంతో పాటు 'జ్ఞాన్ భారతం' కార్యక్రమం ద్వారా భారత పురాతన తాళపత్రాల వారసత్వాన్ని కూడా ప్రభుత్వం పరిరక్షిస్తోందని ఆయన తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 16 వరకు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్: ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ప్రధాన మంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పాల్గొన్నారు. విదేశాల నుంచి పురాతన కళాఖండాలను తిరిగి భారత్?కు తీసుకువచ్చే ప్రయత్నాలు కొత్త ఊపును అందుకున్నాయని తెలిపారు. అదే సమయంలో భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతోందని మోదీ చెప్పారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సరిహద్దులకు అతీతంగా విస్తరించిన దాని నాగరికతా వారసత్వం అనే ఇతివృత్తంతో జరుగుతోంది. ఈ సదస్సును కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని 'ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్' (×+చీజూూ) నిర్వహిస్తోంది. ప్రపంచంతో భారతదేశానికి ఉన్న చారిత్రక, సమకాలీన సాంస్కృతిక సంబంధాలపై చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. దీనికి వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు హాజరవుతున్నారు. అలాగే, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో అప్పటి కలకత్తాలో 1926 అక్టోబర్ 14న భారతీయ పండితుల బృందం స్థాపించిన 'గ్రేటర్ ఇండియా సొసైటీ' (బృహత్తర భారత్ పరిషత్) శతజయంతి ఉత్సవాలకు కూడా ఇది వేదికైందని ×+చీజూూ పేర్కొంది.

# 'జంతర్‌మంతర్ భారత ప్రజలది'

దిల్లీలోని జంతర్?మంతర్ వద్ద నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలను జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. జాతీయ జెండాను ప్రదర్శించినందుకు యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించాయి. నిరసన తెలిపే హక్కును హరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విపక్ష నేతలు విమర్శించారు. జంతర్‌మంతర్ దేశ ప్రజలదని, దాన్ని తిరిగి సాధించుకుంటామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని జైల్లో పెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇలా చేసినందుకు యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి వేర్వేరు వేదికలపై ఉన్నప్పటికీ అందరి లక్ష్యం ఒక్కటే. రాజ్యాంగం కల్పించిన హక్కులను కోరుతూ పౌరులు చేస్తున్న ఆందోళనలన్నీ ఒకే పోరాటంలో భాగం. జంతర్‌మంతర్ భారత ప్రజలకు చెందినది. దాన్ని తిరిగి సాధించుకుంటాం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ గాంధీ తెలిపారు.

**ముందు ఓటు తర్వాత నిరసన హక్కు చోరీ : ఖర్గే**

"ఎస్ఐఆర్ ప్రక్రియకు వెలుపల ఉన్న 13.3 కోట్ల మందిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'చొరబాటుదారులుగా అభివర్ణించడం వారి జాతీయతను అవమానించడమే. సుప్రీంకోర్టు నిర్ణయం ఉన్నప్పటికీ జంతర్‌మంతర్‌ను నిరసనలకు అనుమతించిన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడం అంటే మొదట ఓటు చోరీ ఇప్పుడు నిరసన తెలిపే హక్కు చోరీనే అవుతుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణ కల్పించడం ఆపాలి. యువ నిరసనకారులను జైలుకు పంపడం, ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేయడం, మహిళల పట్ల దురుసుగా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్నట్లు తాను పేర్కొన్న కొన్ని వర్గాలకు అధికారులు స్వేచ్ఛనిస్తున్నారు. మోదీ-షా ప్రభుత్వ విధానాలకు ప్రజలు తలవంచబోరని, బీజేపీని ప్రతి అంశంపై నిలదీస్తారు. దేశ ప్రజలు తమ గొంతు వినిపిస్తూనే ఉంటారు"

**'మన దేశంలో మన జెండా ఎగరేయడం నేరమా?'**

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా సీజేపీ కార్యకర్తలపై చర్యలను తప్పుబట్టారు. సొంత దేశంలో జాతీయ జెండాను ప్రదర్శిం చడం నేరమా అని ప్రశ్నించారు. పోలీసుల చర్య పూర్తిగా హాస్యాస్పదంగా ఉందని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే కూడా సీజేపీ కార్యకర్తల అరెస్టును ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించిన యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి సాధించుకునే వరకు ప్రభుత్వానికి, దేశభక్తులైన యువతకు మధ్య పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

**అరెస్టయిన యువతకు అండగా డీఎంకే**

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సైతం ఈ ఘటనపై స్పందించారు. ఎంతమంది నిరసనకారులను ప్రభుత్వం నిర్బంధించగలదని, ఎంతమంది యువత గొంతులను అణచివేయగలదని ప్రశ్నించారు. యువతను జైలుకు పంపే కొద్దీ రాజకీయాలతో సంబంధం లేని సాధారణ పౌరులు సైతం వీధుల్లోకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేస్తారని అన్నారు. సౌరవ్ దాస్, ఆశుతోష్‌కు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు డీఎంకే సిద్ధంగా ఉందని తెలిపారు. నిరసనకారులపై చర్యలు ప్రజల్లో మరింత వ్యతిరేకతను పెంచుతాయని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా, ఆందోళనల సమయంలో పలువురు నిరసనకారులను పోలీసులు కొట్టారని మీడియా సమావ్వేశంలో రాహుల్ ఆరోపించారు. ప్రజల ముక్తకంఠాన్ని అణచివేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కేంద్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వీరికి కులం, మతం, లింగ భేదాలు లేవని చెప్పారు. ముక్త కంఠంతో పోరాడుతున్న వారిపై దాడులు సహించబోమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా ఈ ప్రజా గళానికి వ్యతిరేకంగా నిలబడుతున్నారని, ఆ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని సూచించారు. దౌర్జన్యాలకు పాల్పడుతున్న పోలీసుల వీడియోలు తీసి, ఆ ఆధారాలను తమకు పంపాలని విద్యార్థులకు సూచించినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారం ముగిసిన తర్వాత ఆ సాక్ష్యాధారాలతో విద్యార్థులపై చేయి చేసుకున్న వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు.

## షార్జాలో భారతీయుడికి జాక్‌పాట్.. లాటరీలో రూ. 13 కోట్లు!



యూఏఈలోని షార్జాలో నివసిస్తున్న కిషోర్ అనే ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. ఆయన ఏకంగా 5 మిలియన్ దిర్హామ్‌ల (సుమారు రూ. 13 కోట్లు) లాటరీ గెలుచుకున్నారు. యూఏఈ లాటరీలో రెండో బహుమతిని ఆయన సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 3న యూఏఈ లాటరీ నిర్వాహకులు డ్రా తీశారు. ఈ డ్రాలో కిషోర్ కొనుగోలు చేసిన టికెట్‌కు రెండో బహుమతి దక్కింది. ఆయన అధికారిక వెబ్‌సైట్ ద్వారా 50 దిర్హామ్‌లు (సుమారు రూ. 1300) వెచ్చించి ఈ టికెట్‌ను కొనుగోలు చేశారు. లాటరీ ఫలితాలు వెలువడిన తర్వాత, విజేతల జాబితాలో తన పేరు చూసి మొదట నమ్మలేకపోయానని కిషోర్ తెలిపారు. ఆ తర్వాత తన వద్ద ఉన్న టికెట్ నంబర్‌తో సరిచూసుకుని, విజేతను తానేనని నిర్ధారించుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ లాటరీ డ్రాలో 30 మిలియన్ దిర్హామ్‌ల (సుమారు రూ. 78 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను ఎవరూ గెలుచుకోలేదని నిర్వాహకులు తెలిపారు. కిషోర్ లాటరీ గెలిచిన విషయాన్ని యూఏఈ లాటరీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఒక్క లాటరీ టికెట్‌తో రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన కిషోర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137